# జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

2019, డిసెంబరు 16-31

వెల : రూ.15/-


సమ పౌరసత్వానికి సమాధి!

లౌకిక భారతాన్ని పరిరక్షించుకుందాం

'కొత్త పౌరసత్వం'తో మేధో వలసలు

తీసివేతలకు జవాబు కూడికలే !

విశ్వ మానవుడి కోసం

మతం పేరిట దౌర్జన్యాలు ఆధిపత్యం కోసమే !

ఏ కలుగులకీ ప్రస్థానం ??

రాజ్యాధికారం - భావ సమాలోచన

శ్రామికవర్గ వెలుగు దివ్వె ఫ్రెడరిక్ ఎంగెల్స్

మార్క్సిజం, నేటి ఔచిత్యం

జాతీయ స్ఫూర్తి పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త

నిడదవోలు వెంకటేశ్వరరావు

2019 డిసెంబర్ 16-31 సంపుటి : 28 సంచిక : 6

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

డా॥ బి. రమేష్‌చంద్రబాబు

కొప్పర్తి వెంకట రమణమూర్తి

డి. సోమసుందర్

మందలపర్తి కిషోర్

వెల : 15/- రూపాయలు

ఈ సంచికలో...

3 సమ పౌరసత్వానికి సమాధి ! - యోగేంద్ర యాదవ్

5 లౌకిక భారతాన్ని పరిరక్షించుకుందాం - పినరయి విజయన్

7 కొత్త పౌరసత్వంతో మేథో వలసలు - రామచంద్ర గుహ

10 తీసివేతలకు జవాబు కూడికలే - కె. శ్రీనివాస్

12 విశ్వ మానవుడి కోసం - డా॥ విరించి విరివింటి

15 Bill Summary PRS

18 మతం పేరిట దౌర్జన్యాలు ఆధిపత్యం కోసమే - డాక్టర్ దేవరాజు మహారాజు

20 ఏ కలుగులకీ ప్రస్థానం ? - మందలపర్తి కిషోర్

21 రాజ్యాధికారం – భావ సమాలోచన

23 కలవడమెలా ? - హెచ్ ఆర్కే

26 శ్రామికవర్గ వెలుగుదివ్వె ఎంగెల్స్ - బి. రామకృష్ణ

29 మార్క్సిజం నేటి ఔచిత్యం - రావు కృష్ణారావు

**చందా వివరాలు**

| | |
|---|---|
| విడి ప్రతి | రూ. 15-00 |
| చందా వివరాలు : | |
| 2 సంవత్సరాలకు | రూ. 500-00 |
| 1 సంవత్సరానికి | రూ. 300-00 |
| విద్యార్థులకు | రూ. 150-00 |

*చందా డి.డి. లేదా మనియార్డరు ద్వారానే పంపండి. చెక్కులు పంపరాదు*

*NEFT లేదా RTGS పంపడానికి*

JAATEEYA SPURTHI
A/c No.3620 101 0000 380
Syndicate Bank, Eluru Main Branch
IFSC Code : SYNB0003620

పంపవలసిన చిరునామా :

**డా॥ బి. రమేష్‌చంద్రబాబు**

క్రాంతి నర్సింగ్ హోమ్, నన్నయ్య విగ్రహం వద్ద
మెయిన్‌రోడ్, తణుకు - 534 211
✆ 08819 222265, 93971 14495

# రాజ్యాంగ పరిరక్షణే తక్షణ కర్తవ్యం

**సంపాదకీయం**


మోడీ సర్కారు ఇప్పుడు సమస్యల ఊబిలో చిక్కుకుంది. “మంచిరోజులు వస్తాయంటే” నమ్మేవారు లేరు. అవినీతిని వెలికి తీస్తామంటే విశ్వసించేవారు లేరు. సబ్కో సాత్ అన్నా, మేకిన్ ఇండియా అన్నా, నిరుద్యోగం బంద్ అన్నా జేజేలు పలికే వారు లేరు. పెద్దనోట్ల రద్దు తర్వాత ఉన్న ఉద్యోగాలు ఉపాధి తరిగిపోవడమే గాని పెరిగిన ఊసు లేదు. ఇప్పుడు దేశాన్ని ఆర్థిక మాంద్యం చుట్టుముట్టింది. కార్పొరేట్లకు లక్షల కోట్లు గుమ్మరిస్తున్నా ఫలితం కానరావడం లేదు. కొనే వాళ్ళ ఆర్థికశక్తి పెరగక పోతే ఈ చిట్కా వైద్యాలు పనిచేయవు. వారికి మిగిలింది విభజించి పాలించడమే. ప్రస్తుత ఆర్థిక దుస్థితి నించి ప్రజల దృష్టిని మళ్లించడంతో పాటు ఎన్నికలలో ఓట్ల వర్షం కురిపిస్తుందన్న దురాశతోనే వారు హిందూత్వ భారతం కోసం త్వరత్వరగా పావులు కదుపుతున్నారు. అస్సామ్‌కే పరిమితమైన ఎన్.ఆర్.సి.ని దేశం అంతటా అమలు చేస్తామని ప్రకటించారు. పౌరసత్వ సవరణ చట్టంలో ముస్లిములను పక్కన పెట్టారు. వీటి అమలుకు తొలి మెట్టుగా కొత్త నిబంధనలతో ఎన్.పి.ఆర్.ని ప్రకటించారు. ఇవి కేవలం జనగణనకు లేదా పౌరసత్వాల నిర్ధారణలు మాత్రమే ఉద్దేశించినవి మాత్రమే కావు.

ఈ మూడు చట్టాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ వాటి లక్ష్యం మాత్రం ఒక్కటే. భారత రాజ్యం స్థానంలో హిందూ రాజ్యం కోసం అడుగులు వేయడానికి ఉద్దేశించినవి మాత్రమే. మన దేశానికి విదేశాల నుండి వచ్చే వలసలు ప్రపంచంలో వివిధ దేశాలకు వస్తున్న వలసలతో పోల్చితే అతి తక్కువగా వున్నాయి. అమెరికా, పశ్చిమ ఐరోపా దేశాలకు వలసలు వారి జనాభాలో 10 నుండి 15 శాతం ఉండగా భారతదేశంలో కేవలం 1 శాతం మాత్రమే వలసదారులు వున్నారు. 2001 –2011 జనాభా లెక్కల ప్రకారం ఈ మధ్య కాలంలో 62 లక్షల మంది నుండి 53 లక్షలకు పడిపోయింది. ప్రత్యేక పరిస్థితి వున్న అస్సాం, ఈశాన్య రాష్ట్రాలలో తప్ప దేశంలో ఏ ఇతర రాష్ట్రంలోనూ ఇది సమస్య కాలేదు. ఒక్క బి జె పి మాత్రమే ఇది దేశమంతా ఆవరించిన పెనుభూతంగా చూపిస్తున్నది. ఎందుకంటే దాని రాజకీయం వేరు.

పౌరసత్వాన్ని నిర్వచించిన రాజ్యాంగం లేదా ఆ తర్వాత వచ్చిన పౌరసత్వ చట్టాలలో ప్రస్తావన లేని మత ప్రాతిపదికను ఇప్పటి పౌరసత్వ సవరణ చట్టంలో చేర్చారు. అది రాజ్యాంగ స్ఫూర్తికి, లౌకిక భావనకు విరుద్ధం. మన దేశం చుట్టూ 7 దేశాలున్నాయి. వాటన్నింటి నుండీ వలసలున్నాయి. కేవలం మూడు ముస్లిం దేశాల నుండి వలస వచ్చే వారికే పరిమితం చెయ్యడం, అందులో ముస్లిములను మినహాయించడం కేవలం మతం ప్రాతిపదికపై భారత పౌరసత్వాన్ని తిరగరాయడం కోసం మాత్రమేనన్నది స్పష్టం అవుతున్నది. డా అంబేద్కర్ సారథ్యంలో మత ప్రమేయం లేని పౌరసత్వ భావనకు, చట్టం ముందు అందరూ సమానమేనన్న భావనకు పూర్తి విరుద్ధంగా ఈ చట్టాలు హిందూ రాజ్యం వైపు మనువాదం వైపు అడుగులు వేస్తున్నాయి. రాజ్యాంగ పరిరక్షణకు పూనుకోవడమే అందరి కర్తవ్యం. ❑

# సమ పౌరసత్వానికి సమాధి!

**యోగేంద్ర యాదవ్**
స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు



'మతపరమైన వేధింపులు, హింసాత్మక పీడనకు గురై మన దేశానికి వలసవచ్చిన మత మైనారిటీలకు ఆశ్రయమివ్వడం కొత్త పౌరసత్వ చట్టం ప్రకటిత లక్ష్యం. కానీ, దాని అసలు లక్ష్యం– భారత గణతంత్ర రాజ్యంలో ముస్లింలు ద్వితీయ శ్రేణి పౌరులేనన్న సంకేతాన్ని పంపడమే. ఇక, మనకు లౌకిక భారతదేశమైనా ఉంటుంది లేదా అసలు భారతదేశమనేదే లేకపోయే విపత్తయినా వాటిల్లుతుంది.

ఇప్పుడు మనం ఏం చేయాలి? ఏం చేసి తీరాలి? 'పౌరసత్వ సవరణ బిల్లు' (సిటిజన్‌షిప్ ఎమెండ్‌మెంట్ బిల్–కాబ్) పార్లమెంటు ఆమోదం పొందిన దృష్ట్యా ఈ ప్రశ్నలు అనివార్యం. కొత్త పౌరసత్వ చట్టం మన రాజ్యాంగంపై ఒక దౌర్జన్యం. ఆ అఘాయిత్యంపై లౌకికవాదుల ప్రతి స్పందన గురించి పునరాలోచించవలసిన సందర్భమిది. పోరాటాన్ని న్యాయస్థానాలు, చట్టసభల నుంచి ప్రజల మధ్యకు తీసుకువెళ్ళాలి. ప్రజారంగమే పోరాట వేదిక కావాలి. ఎందుకంటే ప్రజాభిప్రాయమే తుది తీర్పు. ప్రతిస్పందనాత్మక వ్యతిరేకత నుంచి క్రియాశీలక ప్రతిఘటనకు దిగాలి; అమూర్త భావనలు, వాదాలను పక్కన నెట్టి మరింత వాస్తవిక అవగాహనకు, చైతన్యశీల భావ వ్యాప్తికి పూనుకోవాలి.




'పౌరసత్వ చట్టం– 2019' సంకల్పమే పక్షపాతపూరితమైనది, సమాజంలో విభేదాలు సృష్టించేది. అసోంలో భారతీయ జనతా పార్టీ బెంగాలీ హిందూ ఓటు బ్యాంకును రక్షించుకోవడం ఒక్కటే ఈ చట్టం ధ్యేయం కాదు. 2021లో పశ్చిమబెంగాల్ శాసనసభా ఎన్నికల తరుణంలో మతోన్మాద భావోద్వేగాలను ప్రజ్వలింపచేసే లక్ష్యానికే అది పరిమితం కాదు. 'మతపరమైన వేధింపులు, హింసాత్మక పీడనకు గురై మన దేశానికి వలసవచ్చిన మత మైనారిటీలకు ఆశ్రయమివ్వడం కొత్త పౌరసత్వ చట్ట ప్రకటిత లక్ష్యం. ఇది, ఆ చట్టం అసలు లక్ష్యాన్ని ఉద్దేశపూర్వకంగా కప్పిపుచ్చుతున్నది. అసలు లక్ష్యం– భారత గణతంత్ర రాజ్యంలో ముస్లింలు ద్వితీయ శ్రేణి పౌరులేనన్న లాంఛనప్రాయ సంకేతాన్ని పంపడమే. కఠోర వాస్తవమిది.

పౌరసత్వ చట్టం మన స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తినిచ్చిన, మార్గదర్శకత్వం నెరపిన భారత్ భావనపైన ఒక మహాదాడి. దేశవ్యాప్త జాతీయ పౌర జాబితా (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్––ఎన్ఆర్సీ) తో కలిసి ఈ చట్టం మన గణతంత్ర రాజ్య స్వభావాన్ని వికృతీకరిస్తుంది. ఆ చట్టంతో మన గణతంత్ర రాజ్య ప్రస్థానం 'లౌకిక' పథం నుంచి మిథ్యా లౌకిక బాటకు మళ్ళింది. స్టాండప్, ప్లీజ్ స్టాండప్. భారత్ భావనను విశ్వసించే, గౌరవించే ప్రతి ఒక్కరూ ఆ తిరోగమన పరిణామానికి వ్యతిరేకంగా పోరాడాలి. మనం ఏమి చేయాలి? కొత్త పౌరసత్వ శాసనాన్ని వ్యతిరేకించేవారు ఆ చట్టాన్ని గురించిన అధికారిక కథనాలలోని లోగుట్టును ఐదు ప్రశ్నలతో బహిర్గతం చేయాలి.

అవి: (1) మన ఇరుగు పొరుగు దేశాలలో మత పరమైన వేధింపులు, హింసాకాండకు గురవుతున్న వారికి మన దేశం ఆశ్రయమివ్వదలుచుకుంటే కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్లకు చెందిన వారికే ఎందుకు? ఇతర పొరుగు దేశాలైన మయన్మార్, నేపాల్, చైనాలకు సంబంధించిన వారి మాటేమిటి? (2) మత ప్రాతిపదికన హింసాత్మక పీడన కలవరపడే అంశమే. అయితే, కేవలం మత వేధింపులు మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం ఎంతవరకు సబబు? ప్రాంతీయ వివక్ష, అన్యాయాలు (పాకిస్థాన్‌లోని బెలూచిస్థాన్), జాతి వివక్షల (నేపాల్లో తెరాయి ప్రజలు, శ్రీలంకలో తమిళులు) గురించి భారత్ ఎందుకు పట్టించుకోవడం లేదు? (3) మతపరమైన వేధింపులు, శిక్షలకు మాత్రమే పరిమితం కావాలన్నదే యోచన అయితే అవే పరిస్థితులు ఎదుర్కొంటున్న పాకిస్థాన్లోని అహ్మదీయాలు, షియాలు; చైనాలోని టిబెటను; యయన్మార్లోని రొహింగ్యాలు; శ్రీలంక హిందువులు, ముస్లింలకు ఆశ్రయమివ్వడానికి ఎందుకు నిరాకరిస్తున్నారు? (4) ఇరుగు పొరుగు దేశాలలో మైనారిటీ మతస్థులపై వేధింపులు, శిక్షలు కొనసాగుతుంటే 2014 డిసెంబర్ 31 వరకు మన దేశానికి వలస వచ్చిన ముస్లిమేతర మతస్థులకు

మాత్రమే పౌరసత్వ మివ్వడమేమిటి? (5) కొత్త చట్టం అమలు నుంచి దేశంలోని కొన్ని ప్రాంతాలకు ఏ ప్రాతిపదికన మినహాయింపునిచ్చారు? ఈ ప్రశ్నలకు అధికారవర్గాల నుంచి గానీ, కొత్త చట్టం సమర్థకుల నుంచి గానీ సంతృప్తికరమైన సమాధానాలు లేవు.

సమాధానాలు ఇవ్వలేని పాలకులు ఈ చట్టం గురించి చవకబారు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్లలో మాత్రమే అధికారిక మతాలు ఉన్నాయనే తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నారు (శ్రీలంక రాజ్యాంగం బౌద్ధ మతానికి ప్రాధాన్యమివ్వాలని నిర్దేశించింది). భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు భారత పౌరులు కానివారికి వర్తించవని అధికార వర్గాలు చెప్పుతున్నాయి. ఇదొక అబద్ధం. అవి ప్రతి 'వ్యక్తి'కీ వర్తిస్తాయి. అలాగే, ఈ కొత్త చట్టం బెంగాలీ హిందువులకు పౌరసత్వాన్ని ఇవ్వదన్న వాదనలో నిజం లేదు (బంగ్లాదేశ్ నుంచి వచ్చిన బెంగాలీ హిందువులకు భారత పౌరసత్వం లభిస్తుందని అస్సోం మంత్రి హిమంత బిశ్వ శర్మ మంగళవారం నాడు కూడా చెప్పారు).

భారతీయ జనతా పార్టీ పార్లమెంటులో సంఖ్యాబలంతో బిల్లుపై చర్చలో విజయం సాధించింది. అయితే, వాస్తవాల ప్రాతిపదికన విస్తృత ప్రజాచర్చలో అధికార పార్టీ ఓడిపోయింది. ప్రభుత్వమేమో అన్ని వాస్తవాలను, వ్యతిరేకతలను ఉపేక్షించి, బిల్లు విషయంలో తన మాట నెగ్గించుకున్నది. తన చర్యకు ప్రజల ఆమోదం లభిస్తుందనే విశ్వాసంతోనే ప్రభుత్వం అందుకు పూనుకున్నది. భారతీయ ఆత్మను రక్షించడానికి ఒక మహా పోరాటం జరగవలసి వున్నది. ఈ చట్టానికి న్యాయపరీక్ష అనివార్యం. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో దానిని తప్పక సవాల్ చేస్తారు. న్యాయవ్యవస్థకే అదొక పరీక్ష అవుతుంది. సాధారణ సమయాలలో ఇటువంటి కేసులలో తీర్పును వెలువరించడంలో న్యాయమూర్తులకు పెద్దగా సంక్లిష్టతలు ఎదురు కావు. అయితే ఇవి అసాధారణ రోజులు కదా.

తమకు అనుకూలమైన తీర్పులు వెలువడే విషయమై పాలకులు అమిత శ్రద్ధ చూపుతున్న కాలమిది. ఈ దృష్ట్యా, కొత్త పౌరసత్వ చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేస్తే అదొక సంతోషదాయక, ఆశ్చర్యకర పరిణామమవుతుంది. న్యాయవ్యవస్థ తీర్పు ఎలా వున్నప్పటికీ అది రాజకీయ పోరాటానికి ప్రత్యామ్నాయం కాదు, కాబోదు. ఆ చట్టానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని పెద్ద ఎత్తున సమీకరించవలసి వున్నది. ఇది మాత్రమే అంతిమ ఫలితాన్ని నిర్ణయిస్తుంది.

ఇప్పటికే ఈ పోరాటానికి బీజాలు పడ్డాయి. పార్లమెంటులో బిల్లు ప్రవేశం నాటినుంచి దేశవ్యాప్త నిరసనలు వెల్లువెత్తాయి. ఇవి వేర్వేరు రకాలు. తమను లక్ష్యం చేసుకుంటున్నారని విశ్వసిస్తున్న ముస్లిం బృందాలు ఒక వైపు, ఈశాన్య రాష్ట్రాలలో వెల్లువెత్తిన నిరసనలు మరొకవైపు కనిపిస్తున్నాయి. ఈ రెండింటి మధ్య తేడా వున్నది. బెంగాలీ హిందువులకు పౌరసత్వం కల్పిస్తారనే భయంతో ఈశాన్య రాష్ట్రాలు మండిపడుతుంటే, తమను వివక్షాపూరితంగా మినహాయిస్తున్నారనే భయంతో ముస్లిం బృందాలు నిరసన తెలుపుతున్నాయి. ఇక, దేశ వ్యాప్తంగా పౌర హక్కుల బృందాలు, ప్రజా ఉద్యమాల వారితో సహా సకల సామాజిక వర్గాలు తెలుపుతున్న నిరసనలూ సాగుతున్నాయి.

అవిభాజక పౌరసత్వానికై ఈ మూడురకాల పోరాట స్రవంతులను సమైక్యం చేయవలసివున్నది. కొత్త సవాళ్ళను దీటుగా ఎదుర్కోవడానికి లౌకికవాదులు కొత్త వ్యూహాలను అనుసరించాల్సిన అవసరం ఉన్నది. కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తున్న వారు తొలుత ఈశాన్య రాష్ట్రాలలో వలసకారులకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఎందుకు ప్రజ్వరిల్లుతున్నాయో అర్థం చేసుకోవాలి. అస్సామీలు తదితర ప్రజల భయాందోళనలపై అవగాహన పెంపొందించుకోవాలి. తమ మాతృభూమిలోనే తాము మైనారిటీలమైపోతున్నామనేది ఈశాన్య భారతీయుల ఆందోళన. అదే సమయంలో నిస్సహాయ పరిస్థితులలో వలస వచ్చిన వారి దీనాలాపాలను కూడా అర్థం చేసుకోవాలి. వలస, ఆశ్రయానికి సంబంధించి తమపై వివక్ష చూపని విధానాలను ఆ శరణార్థులు కోరుతున్నారు.

లౌకిక భారతదేశ రక్షణకు జరిగే ఉద్యమం, ప్రస్తుత పాలకుల రాజకీయాలు, విధానాలకే పరిమితం కాకుండా ఒక సువిశాల భూమికతో ప్రతిస్పందించాలి. ప్రతిస్పందనాత్మక వ్యతిరేకత నుంచి క్రియాశీలక ప్రతిఘటనకు సాగాలి. కొత్త తరానికి లౌకికవాద ఆదర్శాలను నూరిపోయాలి. మన మేధో కార్యకలాపాలకు, సాంస్కృతిక వారసత్వాలకు లౌకికవాదమే ప్రాతిపదిక కావాలి. స్వాతంత్ర్యవీరులు రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్ల బలిదానం రోజైన డిసెంబర్ 19న కొత్త పౌరసత్వ చట్ట వ్యతిరేకులంతా దేశవ్యాప్తంగా సమైక్య కార్యాచరణకు ఉపక్రమించ నుండడం ఉత్సాహపరుస్తోంది. లౌకిక భారతదేశం భవిష్యత్తుపై ధైర్యాన్నిస్తోంది. మానవతను మహా ప్రదీప్తం చేస్తోన్న భారతీయ ఆత్మ, సుజల, సుఫల, సస్యశ్యామల సువిశాల భౌగోళిక భారత్ సమగ్రత, సమైక్యతల సంరక్షణ కోసం జరుగుతున్న పోరాటమిది. మనకు లౌకిక భారతదేశమైనా ఉంటుంది లేదా అసలు భారత దేశమనేదే లేకపోయే విపత్తయినా వాటిల్లుతుంది. ❑

# లౌకిక భారతాన్ని పరిరక్షించుకుందాం



**పినరయి విజయన్**
కేరళ ముఖ్యమంత్రి

ఈ పౌరసత్వ సవరణ చట్టం పూర్తిగా ప్రజలను చీల్చేదిగానూ, వివక్షను పాటించేదిగాను, మానవ హక్కులను ఉల్లంఘించేదిగాను ఉంది. దేశంలో మతపరమైన విభజనను సృష్టించి సామాజిక సమీకరణల తీరుతెన్నులను మార్చనున్నది. ఒక మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వటం అంటే ముస్లింల పట్ల వివక్ష చూపడమే అవుతుంది. ఇది లౌకిక స్ఫూర్తికి మౌలికంగా విరుద్ధమైన ధోరణి. పౌరసత్వ (సవరణ) చట్టం ద్వారా లౌకిక ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడికి వ్యతిరేకంగా మన నిరసనను, ఐక్య ప్రతిఘటనను ఇక ఏ మాత్రం వాయిదా వేయలేము.

భారతీయ సమాజపు లౌకిక పునాదులు పెను ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. 2019లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పౌరసత్వ సవరణ చట్టాన్ని మూడు కారణాల రీత్యా తిరస్కరించాలి. మొదటి కారణం–ఈ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి, దిశానిర్దేశానికి విరుద్ధం. రెండో కారణం–ఇది పూర్తిగా ప్రజలను చీల్చేది. లోతైన వివక్ష పునాదిగా కలిగినది. మానవ హక్కులను ఉల్లంఘించేది. హిందూత్వ రాజకీయాల తాత్విక పునాదిగా హిందూ రాజ్యాన్ని నిర్మించేందుకు జరుగుతున్న ప్రయత్నం. అందువల్ల ఈ ప్రయత్నం యావత్తు ప్రజలపైనా, రాజకీయ వ్యవస్థ నిర్మాణంపైనా జరుగుతున్న దాడి. అందుకే ఈ చట్టాన్ని వ్యతిరేకించాలి. మన రాజ్యాంగ విలువలు ప్రమాదంలో పడ్డాయి. ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉన్న వారెవ్వరూ ఈ పరిణామాల పట్ల చలనం లేకుండా నిశ్శబ్దంగా ఉండజాలరు.

## సార్వత్రిక పౌరసత్వానికి వ్యతిరేకం

ఈ మూడు కారణాలను మరింత లోతుగా పరిశీలిద్దాం. పౌరసత్వ సవరణ చట్టం 2019 రాజ్యాంగ దిశా నిర్దేశానికి, స్ఫూర్తికి విరుద్ధమైనది. రాజ్యాంగంలో 5వ అధికరణం నుండి 11వ అధికరణం వరకు పౌరసత్వం గురించిన విధి విధానాలను నిర్దేశించాయి. వాటి ఆధారంగా ఉనికి లోకి వచ్చిందే 'పౌరసత్వ చట్టం–1955'. ఈ చట్టం ప్రకారం ఈ దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తీ, ఈ దేశంలో పుట్టిన వారికి వారసులుగా ఉన్న ప్రతి వ్యక్తీ, భారతీయుడేనని తేల్చి చెప్పింది. ఈ దేశంలో నివశించటానికి సిద్ధపడిన వారికి కూడా సహజసిద్ధంగా పౌరసత్వం సంక్రమిస్తుందని ఈ చట్టం స్పష్టం చేసింది. అదనంగా భారతదేశం కొత్తగా సంక్రమించుకునే భూభాగాల్లో ఉన్న పౌరులకు కూడా భారతీయ పౌరసత్వం వర్తిస్తుందని ఈ చట్టం నిర్ధారిస్తోంది. కానీ 2019లో బిజెపి ప్రభుత్వం ఆమోదించిన పౌరసత్వ చట్టం రాజ్యాంగం ఆదేశిత లక్ష్యం కుల, ప్రాంత, లింగ, జాతి, సాంస్కృతిక పరమైన వివక్షలకు అతీతంగా భారతీయులందరికీ సమాన పౌరసత్వ హక్కు కల్పించాలన్న స్ఫూర్తిని తుంగలో తొక్కింది. 'చట్టం ప్రకారం దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలు, రక్షణ కల్పించాలి' అని రాజ్యాంగంలోని 14వ అధికరణం ఆదేశిస్తోంది. పౌరులకే కాక దేశంలో నివశిస్తున్న వారందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలన్నది రాజ్యాంగం లోని 14వ అధికరణం స్ఫూర్తిగా ఉంది.

ఇక్కడ రాజ్యాంగ స్ఫూర్తి అంటే ఏమిటి? రాజ్యాంగం రూపొందించటానికి ముందు రాజ్యాంగ పరిషత్లో లోతైన, విలువైన చర్చలు జరిగాయి. రాజ్యాంగ పరిషత్ సభ్యులు తమ తమ విజ్ఞతను ఈ చర్చలకు జోడించారు. రాజ్యాంగ పరిషత్ చర్చలను పరిపుష్టం చేసిన వారిలో బాబా సాహెబ్ అంబేద్కర్ శిఖర స్థాయిలో ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో ఎనలేని త్యాగాలు చేసిన కోట్లాది మంది అమరుల ఆకాంక్షలే రాజ్యాంగ స్ఫూర్తిగా మారాయి. మన రాజ్యాంగంలో వాస్తవ రూపం దాల్చాయి. కార్మిక వర్గం, రైతాంగం, సామాజికంగా అణగారిన తరగతులు–వారి మత విశ్వాసాలు వేరైనా–వలస పాలనకు సవాలు విసిరాయి. ఆర్థిక న్యాయం కోసం, మానవ హక్కుల కోసం ఎలగీసి నిలబడ్డాయి. స్వాతంత్ర్య పోరాటం కేవలం వలస పాలకులను గద్దె దించటమనే లక్ష్యానికి పరిమితం కాలేదు. ఆధునిక భారత చరిత్రకు చుక్కానిగా మారిన ఈ సాధారణ ప్రజలే గాఢమైన వివక్ష, అసమానతలతో నిండిన సమాజంలో సామాజిక న్యాయం నినాదాన్ని ముందుకు తేవటంలోనూ, ప్రజాతంత్ర లౌకిక రాజ్యాంగాన్ని సాకారం చేసుకోవటంలోనూ కీలక పాత్ర పోషించారు. రాజ్యాంగ రూపకల్పనతోనే పౌరహక్కుల కోసం, సమ సమాజం కోసం జరిగే పోరాటం ఆగిపోలేదు. అయితే ఈ పోరాటంలో రాజ్యాంగ రూపకల్పన ఓ మైలు రాయి.

స్వాతంత్ర్య సమరయోధులు భారత దేశాన్ని కుల మత వివక్షకు తావు లేని దేశంగా చూడాలని కలలు కన్నారు. భారతీయ

సమాజంలో ఉన్న తీవ్రమైన ఆర్థిక సామాజిక అంతరాలకు స్వస్తి చెప్పే నవ భారత నిర్మాణం గురించి కలలు గన్నారు. 1920 దశకంలో వామపక్ష శక్తులు విడుదల చేసిన ప్రణాళికల్లో ఈ విషయాలు సుస్పష్టంగా వ్యక్తం చేయబడ్డాయి. భగత్‌సింగ్‌ను ఆయన, సహచర కామ్రేడ్లను ఉరి కంబాలెక్కించిన తర్వాత 1931లో కరాచీలో జరిగిన జాతీయ కాంగ్రెస్‌లో ప్రతిపాదించిన తీర్మానంలో ఈ లక్ష్యాలు స్పష్టంగా వున్నాయి. అప్పటికే సమరశీల ప్రజా ప్రతిఘటన తలెత్తటంతో భావప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, సమావేశాలు జరుపుకునే హక్కు, సంఘాలు పెట్టుకునే హక్కు, చట్టం ముందు అందరూ సమానమే అన్న తీర్మానాన్ని ఆమోదించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

బ్రిటిష్ పాలిత భారత దేశంలో సాగిన జాతీయోద్యమాన్ని స్వదేశీ సంస్థానాల్లో సాగిన ప్రజా పోరాటాలు మరింత బలోపేతం చేశాయి. స్వతంత్ర భారతంలో మతతత్వ వాసనలు లేని రాజకీయాలను కాంక్షించారు మన పూర్వీకులు. భారత రాజ్యాంగంలో లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, సమాఖ్యతత్వం, వైవిధ్యం గురించి ప్రస్తావించిన భాగాల పైనే స్వాతంత్ర్యోద్యమంలో వీసమెత్తు పాత్ర లేని మతోన్మాదులు దాడి చేస్తున్నారన్న వాస్తవాన్ని మరువకూడదు. నేటి హిందూత్వ కంకణధారుల పూర్వీకులు బ్రిటిష్ పాలకుల ముందు సాగిలపడిన సంఘటనలు స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చీకటి అధ్యాయాలుగా మిగిలిపోతాయి. ఎంత తిరస్కరించినా వారి చీకటి చరిత్రను తుడిచేయలేము.

## హక్కుల ఉల్లంఘన

ఈ పౌరసత్వ సవరణ చట్టం పూర్తిగా ప్రజలను చీల్చేదిగానూ, వివక్షను పాటించేదిగాను, మానవ హక్కులను ఉల్లంఘించేదిగాను ఉంది. ఈ చట్టాన్ని వ్యతిరేకించటానికి గల రెండో కారణమిది. పైన ప్రస్తావించుకున్నట్లు సుదీర్ఘ సమరశీల పోరాట ఫలితమే మనం నేడు అనుభవిస్తున్న స్వాతంత్ర్యం. ఈ స్వాతంత్ర్యం మనుగడకు పౌరసత్వ సవరణ చట్టం ప్రధాన అవరోధంగా మారుతుంది. సుదీర్ఘ పోరాటాల తర్వాత సాధించుకున్న ప్రజాతంత్ర రాజ్యాంగం ప్రజల మధ్య ఉన్న వ్యక్తిగత వ్యత్యాసాలు, సామాజిక తరగతుల మధ్య ఉన్న వ్యత్యాసాలును గుర్తిస్తోంది. భారతదేశం లోని పౌరులందరి ఒకరికొకరు, ఒకరి కోసం ఒకరు అన్న విశ్వాసం కల్పించటం ద్వారానే ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించగలము.

బిజెపి ఆమోదించిన పౌరసత్వ సవరణ చట్టం దేశంలో మతపరమైన విభజనను సృష్టించి సామాజిక సమీకరణల తీరుతెన్నులను మార్చనున్నది. ఈ చట్టం బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ నుండి 2014 డిసెంబరు 31కి ముందు వలస వచ్చిన హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, జైనులు, పార్శీలు, బౌద్ధులకు పౌరసత్వం ఇచ్చేందుకు సిద్ధమైంది. ఆయా దేశాల నుండి వలస వచ్చే ముస్లింలకు పౌరసత్వం ఇవ్వరాదన్నది ఈ చట్టంలో బాహాటంగా వ్యక్తం చేయబడిన అంశం. ఒక మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వటం అంటే ముస్లింల పట్ల వివక్ష చూపడమే అవుతుంది. ఇది లౌకిక స్ఫూర్తికి మౌలికంగా విరుద్ధమైన ధోరణి.

అందువల్లనే పౌరసత్వ సవరణ చట్టంలోని మానవ హక్కుల ఉల్లంఘనను, వివక్షను గుర్తించిన లక్షలాదిమంది వివిధ రాష్ట్రాల్లో వీధుల్లోకి వచ్చి తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు ఈ చట్టానికి వ్యతిరేకంగా వీధుల్లోకి రావటం చెప్పుకోదగ్గ పరిణామం. బిజెపి, దాని మిత్రులు తమకున్న సంఖ్యా బలంతో పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ చట్టాన్ని నెగ్గించుకున్నా నవ భారత పౌరుల నుండి ఆమోదం పొందటం అంత తేలిక కాదన్న వాస్తవాన్ని ఈ ఆందోళనలు ధృవీకరిస్తున్నాయి. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పెల్లుబుకుతున్న ఆందోళనలను గమనిస్తే స్వాతంత్ర్యోద్యమ కాలంలో వలస పాలనను ఎదిరిస్తూ జాతీయ జండాలు చేపట్టిన విద్యార్థి తరం లాగానే ఈ తరం పౌరులు కూడా కులమత చీలికలను అధిగమించి ఐక్యంగా ముందడుగు వేస్తున్నారు. వివక్షతో కూడుకున్నదని, మానవ హక్కులను ఉల్లంఘిస్తుందని వారు ఈ చట్టాన్ని తిరస్కరిస్తున్నారు.

## హక్కుల ఎజెండా

చివరిగా ఓ అంశం. హిందూత్వ ఎజెండా... దేశాన్ని హిందు రాష్ట్రగా మార్చాలన్న దాని లక్ష్యం...ఈ పౌరసత్వ సవరణ చట్టంలో అంతర్లీనంగా వ్యక్తం అవుతున్నాయన్నది బిజెపి, ఆరెస్సెస్ల గత చరిత్రను గమనిస్తే అర్థమవు తుంది. జాతీయోద్యమంలో ఈ సంఘపరివార శక్తులకు వీసమెత్తు పాత్ర లేదన్న విషయాన్ని మరోసారి గుర్తు చేసుకోవాలి. 'హిందూ జాతి' అన్న సిద్ధాంతాన్ని ఎం.ఎస్ గోల్వాల్కర్ ముందుకు తెచ్చాడు. గోల్వాల్కర్ ఊహించిన హిందూ రాజ్యంలో అన్య మత విశ్వాసాలకు చెందిన పౌరులకు పౌరసత్వం ఉండదు. అందువల్లనే ఈ పౌరసత్వ సవరణ చట్టం భారతీయ లౌకిక సమాజంపై బిజెపి సంధిస్తున్న తాజా బాణంగా గుర్తించాలి.

వామపక్షాలు అధికారంలో ఉన్న చోట్ల మత సామరస్యాన్ని కాపాడటానికి వీలుగా పాలనా యంత్రాంగాన్ని సమర్థవంతంగా పనిలో పెట్టాయి. అధికారంలో లేని చోట్ల ప్రజలను సమీకరించి మత సామరస్యాన్ని కాపాడేందుకు కృషి చేశాయి.

☞ మిగతా 9వ పేజీలో

# 'కొత్త పౌరసత్వం'తో మేధో వలసలు



**రామచంద్ర గుహ**
చరిత్రకారుడు

పౌరసత్వ సవరణ చట్టం పర్యవసానంగా మేధావుల వలసలు (బ్రెయిన్ డ్రెయిన్) ముమ్మరమయ్యే అవకాశం ఎంతైనా వున్నది. విదేశాలలో చదువుకున్న భారతీయ శాస్త్రవేత్తలలో అతి కొద్ది మంది మాత్రమే, సంకుచిత దురభిమానాలు పెచ్చరిల్లిపోయిన స్వదేశానికి తిరిగివస్తారు. భారత్‌కు వాటిల్లే నష్టం అమెరికాకు లాభదాయకం కానున్నది.

పౌరసత్వ సవరణ బిల్లు (ఇప్పుడు చట్టం)కు వ్యతిరేకంగా అనేక మంది అనేక విధాలుగా నిరసన తెలుపుతున్నారు. ఆ నిరసనలు ఇంకా వెల్లువెత్తనున్నాయి. భారత్ను పూర్తిగా ఒక భిన్న దేశంగా రూపొందించేందుకు ప్రయత్నిస్తున్న ఈ చట్టం భారత రాజ్యాంగ హృదయంపై శరాఘాతానికి పాల్పడింది. కనుకనే వివిధ రంగాలకు చెందిన సంఖ్యానేకులు ఆ చట్టానికి వ్యతిరేకంగా తమ గళమెత్తారు.

కొత్త పౌరసత్వ చట్టంతో విభేదిస్తున్న వారిలో భారతీయ శాస్త్రవేత్తలూ అగ్రగాములుగా వున్నారు. మన శాస్త్రవేత్తలు సాధారణంగా రాజకీయాల పట్ల ఆసక్తి చూపరు. ప్రజాహిత అంశాలపై సమష్టి కార్యాచరణకు పేరుపడినవారూ కాదు. మన ఉన్నత విద్యా సంస్థలకు చెందిన దాదాపు వేయి మంది ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడుతున్న దశలోనే వ్యతిరేకిస్తూ ఒక పిటిషన్‌పై తమ సంతకాలు చేశారు. ఆ పిటిషన్ ఇలా పేర్కొంది: 'భారత స్వాతంత్ర్యోద్యమం నుంచి ఆవిర్భవించిన భారత్ భావనను మన రాజ్యాంగంలో పొందుపరిచారు. అన్ని మతాల అనుయాయులను సమానంగా చూడాలని ఆ భావన ఉద్బోధిస్తుంది. ప్రతిపాదిత బిల్లులో పౌరసత్వానికి మతాన్ని ప్రమాణంగా పాటించడం ఆ సమున్నత చరిత్రతో పూర్తిగా విభేదించడమే అవుతుంది. మన రాజ్యాంగ మౌలిక సూత్రాలకు ఆ బిల్లు పూర్తిగా విరుద్ధమైనది. ఆ బిల్లు పరిధి నుంచి మైనారిటీ మతస్థులను ముఖ్యంగా ముస్లింలను మినహాయిస్తుండడం వల్ల మన లౌకిక, ప్రజాస్వామ్య, బహుతావాద వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి లోనవగలదని మేము భయపడుతున్నాము'. వారు ఇంకా ఇలా అన్నారు: 'పౌరసత్వ సవరణ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలి. దాని స్థానంలో శరణార్థుల, మైనారిటీల సమస్యలను వివక్షారహిత పద్ధతిలో పరిష్కరించేందుకు దోహదం చేసే మరో సముచిత బిల్లును తీసుకురావాలి'.

ఈ పిటిషన్‌పై సంతకం చేసిన వారిలో రాయల్ సొసైటీ (ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక శాస్త్ర పరిశోధనా సంస్థ) ఫెలోలు, మన దేశంలోని ప్రపంచ ప్రమాణాలకు దీటుగా సరితూగే పరిశోధనా సంస్థల డైరెక్టర్లు, ఐఐటీల ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు వున్నారు.

నేను చరిత్రకారుడినే అయినప్పటికీ శాస్త్రవేత్తల కుటుంబం నుంచి వచ్చాను. నా పరిశోధనా వ్యాసంగంలో మూడు దశాబ్దాలకు పైగా భారతీయ వైజ్ఞానిక జగత్తులోని ఉత్కృష్ట ధీమంతులతో కలిసి పనిచేయడం జరిగింది. ఈ అనుభవ ప్రాతిపదికన పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మన శాస్త్రవేత్తల ప్రకటన అసాధారణమైనదని నిశ్చితంగా చెప్పగలను. ఈ ప్రకటన చేసినవారు నిత్యం ఏదో ఒక అంశంపై తప్పకుండా సంతకాల ఉద్యమాన్ని నిర్వహిస్తుండే జేఎన్యూ విద్యార్థులు, అధ్యాపకులు కారు; మానవహక్కుల కార్యకర్తలూ కారు; వామపక్షాల వైపు మొగ్గే సృజనాత్మక కళాకారులూ కారు. శాస్త్ర ప్రపంచంలో సమున్నత గౌరవాదరాలు గల ప్రతిభావంతులూ, ప్రభవిస్తోన్న యువ వైజ్ఞానికులు. జాతి హిత అంశంపై వారు సమష్టిగా ఒక బహిరంగ ప్రకటన చేయడం నిజంగా ఆశ్చర్యకరమైన విషయం. పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకించిన ప్రకటనపై సంతకం చేసిన శాస్త్రవేత్తలలో ఒకరు బ్రిటన్‌లో స్థిరపడిన నోబెల్ శాస్త్రవేత్త వెంకట్రామన్ (వెంకి) రామకృష్ణన్. మతం ప్రాతిపదికన వివక్ష చూపడమనేది విజ్ఞానశాస్త్రానికి గానీ, సమాజానికి గానీ ఏ మాత్రం మేలు చేయదని ఆయన స్పష్టం చేశారు. 'ఎటువంటి దురభిమానాలు, వివక్షకు తావులేకుండా ప్రతిభా సామర్థ్యాలను గుర్తించి, గౌరవించే వాతావరణాన్ని విద్యావేత్తలు కోరుకుంటారు. అటువంటి స్వేచ్ఛాయుత వాతావరణంలోనే వైజ్ఞానిక పరిశోధనలు సత్ఫలితాలను సాధించగలుగుతాయని' వెంకీ నొక్కి చెప్పారు.

ప్రొఫెసర్ రామకృష్ణన్ ఇటీవలి సంవత్సరాలలో తరచు తాను పుట్టి పెరిగిన ఈ దేశానికి వస్తున్నారు (ఆయన ఉన్నత విద్యాభ్యాసం ఒకనాటి ప్రశస్త, ఇప్పుడు పతనావస్థలో వున్న

బరోడాలోని ఎమ్.ఎస్.యూనివర్శిటీలో జరిగింది). ఆయన ఏటా భారత్ను సందర్శిస్తూ ప్రసంగాలు చేస్తున్నారు. విద్యావిషయిక సదస్సులలో పాల్గొంటున్నారు. వివిధ వయస్సులలో వున్న, భిన్న నేపథ్యాల నుంచి వచ్చిన భారతీయులతో మాట్లాడుతున్నారు. ఈ ప్రత్యక్ష అనుభవాల ఆధారంగానే ఆయన ఇలా అన్నారు: 'యువ భారతీయులు అపూర్వ జ్ఞానాన్వేషకులు. కష్టపడి పనిచేసే మనస్తత్వం గలవారు. ఏదో ఒకటి సాధించాలనే తపనతో అత్యంత క్లిష్ట పరిస్థితులలో చాలా ఓర్పుతో శ్రమిస్తున్నారు. దేశంలో విభేదాలు, చీలికలు సృష్టించడం ద్వారా జాతి నిర్మాణంలో నిమగ్నమైన ఆ యువ మేధావులకు ఎటువంటి ఆటంకాలు కల్పించకూడదని మేము కోరుతున్నాము'.

ఇతర ప్రముఖ శాస్త్రవేత్తల వలే వెంకీ రామకృష్ణన్ కూడా తన పరిశోధనలకే ప్రాధాన్యమిస్తారు. ప్రజాసమస్యలు, జాతి హిత అంశాలపై బహిరంగ చర్చలలో తరచూ పాల్గొనరు. అయితే, పౌరసత్వ సవరణ బిల్లును ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 'నేను బ్రిటన్‌లో స్థిరపడినప్పటికీ నా మాతృదేశం అంటే నాకు ఎంతో అభిమానం. ఆ కారణంగానే నేను పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా గళమెత్తాలని నిర్ణయించుకున్నాను. ఒక మహా సహనశీల ఆదర్శానికి భారత్ ప్రాతినిధ్యం వహిస్తుందని నేను భావిస్తున్నాను. భారత్ సకల రంగాలలో సర్వోత్కృష్ట విజయాలు సాధించాలని నేను కోరుకుంటున్నానని' ఆయన అన్నారు. వెంకీ ఇంకా ఇలా అన్నారు: 'ఇరవై కోట్ల మంది ప్రజలను ఉద్దేశించి మీ మతం ఇతర మతాలకు సమానమైనది కాదని చెప్పడాన్ని నేను తీవ్రంగా ఆక్షేపిస్తున్నాను. అటువంటి ధోరణి భారతీయ సమాజంలో సామరస్యాన్ని భగ్నం చేస్తుంది. ఇది ఎంత మాత్రం జాతి శ్రేయస్సుకు తోడ్పడదు'.

మన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి (ఈయనే శాస్త్ర, సాంకేతిక రంగాల మంత్రి కూడా) వివిధ ప్రజా వేదికలపై భారతీయ వైజ్ఞానిక ప్రతిభ గురించి మిథ్యాసత్యాలను ప్రకటిస్తుండడంపై దేశంలో పని చేస్తున్న శాస్త్రవేత్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. వివిధ కీలక పదవులకు సంబంధించిన నియామకాలలో రాజకీయ జోక్యం పెరిగి పోతుండడం పట్ల వారు ఆందోళన చెందుతున్నారు. స్వతంత్ర, మౌలిక వైజ్ఞానిక పరిశోధనకు దోహదం చేసే అనుకూల వాతావరణం మరింత తగ్గిపోగలదనే వారి భయాందోళలను పౌరసత్వ సవరణ చట్టం ధ్రువీకరించింది.

వైజ్ఞానిక పరిశోధనలకు అత్యుత్తమ సదుపాయాలు, సమున్నత ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు ఉన్న దేశం అమెరికా. ఒకప్పుడు ఈ ఘనత జర్మనీకి వుండేది.. వెంకీ రామకృష్ణన్ ఇలా అన్నారు: 'పాలకుల భావజాల కోణం నుంచి సైన్స్ గురించి ఆలోచించిన దేశాలు తమ వైజ్ఞానిక ప్రతిభను సర్వనాశనం చేసుకున్నాయి. జర్మనీయే ఇందుకొక ఉదాహరణ. హిట్లర్ సంకుచిత భావజాల ప్రభావంనుంచి కోలుకునేందుకు జర్మనీకి యాభై సంవత్సరాలు పట్టింది'. జర్మనీకి జరిగిన నష్టం అమెరికాకు విశేష లబ్ధిని సమకూర్చిందని కూడా వెంకీ చెప్పి వుండవల్సింది. హిట్లర్ అనుసరించిన మూర్ఖపు విధానాల కారణంగానే ఎంతో మంది జర్మన్ శాస్త్రవేత్తలు అమెరికాకు వలసపోయారు.

ఏ దేశంలో నైనా సైన్స్ నిజంగా వర్ధిల్లాలంటే ఆ దేశానికి పటిష్ఠ వ్యవస్థ వుండాలి; వైజ్ఞానిక పరిశోధనలకు ప్రభుత్వ సహాయ సహకారాలు సంపూర్ణంగా వుండాలి; ప్రజాస్వామ్యాన్ని, బహుళత్వ సంస్కృతిని పరిపుష్టం చేసే రాజకీయ వాతావరణం వుండాలి. ఈ మూడు పరిస్థితులు అమెరికాలో పరిపూర్ణంగా వున్నాయి. ఆ మూడు విధాల పరిస్థితులను పెంపొందించుకునేందుకు భారత్ చాలా ప్రయాస పడుతున్నది. మోదీ ప్రభుత్వ విధానాల కారణంగా ఆర్థికాభివృద్ధి మందగమనంలో పడిపోయింది. మోదీ సర్కార్ పూర్తిగా మేధావుల వ్యతిరేక ప్రభుత్వం. ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టంతో ప్రజాస్వామ్యం, బహుళత్వ సంస్కృతికి పెనుముప్పు వాటిల్లనున్నది. ఈ కారణాల వల్లే కొత్త పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా భారతీయ శాస్త్రవేత్తలు మున్నెన్నడూ లేని విధంగా సమష్టిగా నిరసన తెలిపారు.

నిరంకుశాధికార తత్వం వైజ్ఞానిక పరిశోధనల పురోగతికి దోహదం చేయదు. మత దురభిమానం వల్ల శాస్త్ర పరిశోధనలకు అంత కంటే ఎక్కువ హాని జరిగే అవకాశం ఎంతైనా వున్నది. ప్రతి వైజ్ఞానిక సత్యాన్ని హిందువులు ఏనాడో కనిపెట్టారని, ముస్లింల కంటే హిందువులే ఉత్కృష్టులని విశ్వసించే రాజకీయవేత్తలు ఈ దేశాన్ని పరిపాలిస్తున్నంత వరకు మన వైజ్ఞానిక ప్రతిభ వికసించదు, వర్ధిల్లదు. అలాగే మన ఆర్థిక వ్యవస్థ కూడా పరిపూర్ణంగా పురోగమించలేదు.

1950, 1960 దశకాలలో విదేశాలలో శిక్షణ పొందిన ఎంతో మంది భారతీయ శాస్త్రవేత్తలు తమ ప్రతిభాపాటవాలను మాతృదేశ సేవలో ఉపయోగించడానికి స్వదేశానికి తిరిగివచ్చారు. సమున్నత ఆదర్శాల ప్రేరణతో స్వతంత్ర భారత్‌ను ఒక శక్తిమంతమైన జాతిగా తీర్చిదిద్దేందుకు వారు పాటుపడ్డారు. లౌకిక విలువలు, ప్రజాస్వామ్యానికి నిబద్ధమై నవీన వైజ్ఞానిక పరిశోధనలను ప్రోత్సహించిన మన ప్రథమప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో ఆనాడు దేశంలోని రాజకీయ వాతావరణం

కూడా ఆ దేశభక్తి ప్రపూరితులైన శాస్త్రవేత్తలకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. నెహ్రూ అనంతర కాలంలో కూడా విదేశాలలో శిక్షణ పొందిన భారతీయ శాస్త్రవేత్తలు స్వదేశానికి తిరిగివచ్చారు. వ్యక్తిగత జీవితాలకు, పరిశోధనా వ్యాపకాలకు పాశ్చాత్య దేశాలలో అపార అవకాశాలు ఉన్నప్పటికీ వారు భారత్‌కు తిరిగిరావడం చెప్పుకోదగిన విషయం. మౌలిక పరిశోధనలను స్వేచ్ఛగా ప్రోత్సహించే ఉన్నత విద్యాసంస్థలు ఇంకా వర్ధిల్లుతుండడం వల్లే వారు స్వదేశానికి తిరిగి వచ్చారు. నా సహపాఠులు పలువురు హార్వార్డ్, కొలంబియా, ప్రిన్స్‌టన్, కార్నెల్ మొదలైన ప్రపంచ అగ్రగామి విశ్వ విద్యాలయాలలో పరిశోధనలు చేశారు. వారు కోరుకుంటే ఆ విశ్వవిద్యాలయాలలోనే వారికి అధ్యాపకులుగా నియామకాలు లభించి వుండేవి. అయినా వారు మాతృదేశానికి తిరిగి వచ్చారు. మరి వారి విద్యార్థులు సైతం అలా తిరిగి రావడానికి ఇష్టపడుతున్నారా?

టెస్ట్ ట్యూబ్ బేబీలను సృష్టించడం, విమానాలను రూపొందించి నడపడం పురాతన హిందువులకు బాగా తెలుసని చెబుతున్న కేంద్ర మంత్రులే గాక, ప్రధాన మంత్రి సైతం చెప్పడాన్ని నేటి యువ భారతీయ శాస్త్రవేత్తలు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వైజ్ఞానిక నిపుణుల సలహాలు, సూచనలను ఉపేక్షించడాన్ని కూడా వారు చూస్తున్నారు. మన ఉత్కృష్ట విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు సైతం ఆరెస్సెస్ విధేయులను వీసీలుగా, డైరెక్టర్లుగా నియమించడాన్ని కూడా వారు చూస్తున్నారు. పోలీసులు విశ్వ విద్యాలయాల గ్రంథాలయాలను కూడా ధ్వంసం చేయడాన్ని (బ్రిటిష్ పాలకుల హయాంలో కూడా ఎన్నడూ సంభవించని పరిణామమిది) కూడా వారు చూస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వైజ్ఞానిక పరిశోధనకు సంపూర్ణ సానుకూల పరిస్థితులు ఉన్న దేశంలో తమ పరిశోధనా వ్యాసంగాలకు అవకాశం లభిస్తే వారు ఈ దేశంలో ఎందుకు వుంటారు?

పౌరసత్వ సవరణ చట్టం (అలాగే సాధారణంగా హిందూత్వ అధిక సంఖ్యాక వాదం) పర్యవసానంగా మేధావుల వలసలు (బ్రెయిన్ డ్రెయిన్) ముమ్మరమయ్యే అవకాశం ఎంతైనా వున్నది. విదేశాలలో చదువుకున్న భారతీయ శాస్త్రవేత్తలలో అతి కొద్ది మంది మాత్రమే, సంకుచిత దురభిమానాలు పెచ్చరిల్లిపోయిన స్వదేశానికి తిరిగివస్తారు. భారత్‌కు వాటిల్లే నష్టం అమెరికాకు లాభదాయకం కానున్నది. భారతీయ వైజ్ఞానిక పరిశోధనలకు ఉజ్వల భవిష్యత్తు విషయమై భరోసా కన్పించడం లేదు. అయితే వివక్షాపూరిత పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మన శాస్త్రవేత్తలు పలువురు తమ గళమెత్తడం హర్షదాయకం. వారికి మనం కృతజ్ఞతాబద్ధులం. జాతి భవిష్యత్తు గురించి జాగరూకత వహించే ప్రభుత్వం భారతీయ వైజ్ఞానిక ప్రపంచంలోని సమున్నత ఆలోచనాపరులు చెప్పే మాటలను తప్పకుండా వినాలి. మోదీ ప్రభుత్వం వినదు. ఎందుకంటే అది మేధావులకు వ్యతిరేకమైనది. అంతేకాదు మూఢ విశ్వాసాలు, మత దురభిమానంతో వ్యవహరించే ప్రభుత్వమది. అయితే పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా మన శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలను నిండు నిజాలని చరిత్ర నిరూపిస్తుంది. శాస్త్రవేత్తలు తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేయడం భారతదేశానికి అవసరం. అందుకే వారు కొత్త పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడారు. ❑

---

## లౌకిక భారతాన్ని పరిరక్షించుకుందాం

**(6వ పేజీ తరువాయి)**

### కేరళ సందేశం

లౌకికతత్వం కోసం, సామాజిక సమానత్వం కోసం కేరళ సాగించిన పోరాటం నుండి మనం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. చారిత్రకంగా కేరళ పునరుజ్జీవనోద్యమానికి తోడ్పడిన వేర్వేరు స్రవంతులు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులు... వివక్షకు, మతోన్మాదానికి వ్యతిరేకంగా సామాజిక ఆర్థిక సమానత్వం కోసం పెద్దఎత్తున పోరాటం నడిపాయి.

కేరళలోని అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు (హిందూత్వ శక్తుల నాయకత్వంలో ఉన్నవి మినహా) పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఐక్యమవుతున్నాయి. డిసెంబరు 16న తిరువనంత పురంలో శాంతియుతంగా సాగిన సత్యాగ్రహ శిబిరానికి అన్ని రాజకీయ పార్టీలు, మత విశ్వాసాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. దేశం ముందున్న ప్రమాదాన్ని ఎదుర్కొనటానికి, రాజ్యాంగ విలువలు, ప్రాథమిక మానవ హక్కుల పరిరక్షణకు, అన్ని రకాల వివక్షలను వ్యతిరేకించ టానికి తామంతా సమైక్యంగా దృఢనిశ్చయంతో ఉన్నామన్న సందేశాన్ని ఈ శిబిరం ఇచ్చింది.

పౌరసత్వ (సవరణ) చట్టం ద్వారా లౌకిక ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడికి వ్యతిరేకంగా మన నిరసనను, ఐక్య ప్రతిఘటనను ఇక ఏ మాత్రం వాయిదా వేయలేము. ❑

**ప్రజాశక్తి సౌజన్యంతో...**

# తీసివేతలకు జవాబు కూడికలే !

- కె. శ్రీనివాస్
ఆంధ్రజ్యోతి సంపాదకులు



పౌరసత్వ చట్టంపై నిరసనల్లో వ్యక్తమైన సజీవ ఐక్యత– ఈ దేశానికి సరికొత్త హామీ ఇచ్చింది. శాంతి, సామరస్యం, సహజీవనం, పరస్పరత– ఈ విలువలు ఈ దేశంలో చాలా లోతుగా పాదుకుని ఉన్నాయి. వాటిని పెకిలించే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నా, వేళ్లు గట్టిగా ఉన్నాయి. కొత్తగా వస్తున్న విద్యావంతుల తరం, ఈ దేశవృక్షం కొమ్మల నుంచి ఊడలు దిగి, వేళ్లతో సంభాషిస్తున్నది. శరణార్థుల విషయంలో అయినా సరే, మతపరమయిన వివక్ష ఎక్కడా ఉండకూడదనీ, అది రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైనదని యువత నమ్ముతున్నది, దాని కోసం నిలబడుతున్నది.




డిసెంబర్ 19 గురువారం. జామియా మిలియా యూనివర్సిటీ కేంపస్ లోపలా, ఎదురుగా కూడా నిరసనలు జరుగుతున్నాయి. అంతకు ముందు ఆదివారం నాడే అక్కడ విద్యార్థులపై బీభత్సం జరిగింది. పోలీసులపై రాళ్ల వర్షం కురిసింది. గురువారం నాడు మాత్రం ఒక ప్రశాంతత. క్రమశిక్షణ. రోడ్డంతా కిక్కిరిసిన జనం.

ఇంతలో ముస్లిముల ప్రార్థనల వేళ అయింది. ముస్లిమేతర విశ్వాసాల వారంతా, ట్రాఫిక్కు అంతరాయం లేకుండా, సగం రోడ్డు మీద మానవహారంలాగా ఏర్పడి, ముస్లిమ్ నిరసనకారుల ప్రార్థనలకు వీలు కల్పించారు. అదొక అద్భుత దృశ్యం. భారతీయత పరవశించే సన్నివేశం. ద్వేషాన్ని అధికారిక ఉద్వేగంగా ప్రజల మీద రుద్దుతున్నవారికి సున్నితమయిన చెంపపెట్టు. ముస్లిములనే కాదు, ఏ మతస్థులైనా సరే తమ విశ్వాసాల ప్రకారం పూజలో ప్రార్థనలో చేసుకోవాలంటే, ఆ సమూహంలోని తక్కిన వారంతా అదే విధంగా సహకరిస్తారు. ఆ పరస్పరత ఆ సేతు హిమాచలం, వీధుల్లో జనంతో పోటెత్తిన ప్రతిచోటా ఒక పతాకంలాగా రెపరెపలాడింది.

జామియా మిలియా విద్యార్థిని అనుజ్ఞ అంటుంది– నా తోటివారు బాధపడుతుంటే, నేనెట్లా ఊరుకుంటాను, నేను చదువుకుంటున్నాను కదా, నా తల్లిదండ్రులు ఇంత ఖర్చుపెట్టి మాకు చదువు చెప్పిస్తున్నారు కదా, ఆ చదువు మాకు నేర్పిన విచక్షణను మేం ఈ సమాజం కోసం దేశం కోసం ఉపయోగించ లేకపోతే ఏమి ప్రయోజనం? చదువులలో మర్మమెల్ల చెప్పిన ఆ అమ్మాయి చేత ఈ దేశపు పూర్వపు, ప్రస్తుత మానవవనరుల మంత్రులు తప్పనిసరిగా పాఠం చెప్పించుకోవాలి. మన దేశపు చదువులు ఎంతగా కునారిల్లిపోయినా, ప్రాథమిక విద్యనుంచి పోస్టుగ్రాడ్యుయేట్ చదువుదాకా అందించే విద్యాసంస్థలను ప్రభుత్వమే స్వహస్తాలతో గొంతు నులుముతున్నా, మనుషు లందరినీ మరలుగా మార్చే ఫ్యాక్టరీలు బదులుగా కాలేజీలుగా చెలామణీ అవుతున్నా– సరే, అందినంత మాత్రం చదువు మనుషులను ఇంకా కదిలిస్తూనే ఉన్నది. తెలుసుకున్న కొంతయినా మంచిచెడ్డల విచక్షణకు అవకాశం ఇస్తున్నది. అమానవీయ ఆలోచనలను కనీసం ప్రశ్నించే శక్తినిస్తున్నది. అందుకే చదువులు ఆగిపోకూడదు. అనుజ్ఞ లాగా, సాటివారి కష్టానికి స్పందించాలని, చదువుకున్నందుకు ప్రశ్నించాలని ఈ దేశంలో కొందరైనా అనుకుంటున్నారు.

దేశమంతా జనప్రవాహాలు ఎవరినో నశించమని శాపనార్థాలు పెట్టడం లేదు. ఏవి వర్థిల్లాలో ప్రదర్శిస్తున్నాయి. దేశమంతా మువ్వన్నెల జెండాలు ఉద్యమంతో రెపరెపలు కలుపుతూ ఎగురుతూ ఉంటే అంబేద్కర్, గాంధీ బొమ్మలు ప్లకార్డుల్లో మంచి మాటలు చెబుతుంటే, పిల్లలు అడుగుతున్నారు, రాజ్యాంగాన్ని అనుసరించమని, పెద్దలు అడుగుతున్నారు, పౌరసత్వ చట్టాన్ని వెనక్కి తీసుకొమ్మని. మరో చంద్రశేఖర్ ఆజాద్ 'రావణ్', జామా మసీదు మెట్ల మీద భారత రాజ్యాంగాన్ని ఒక

ఆయుధంగా ధరించి, నిరసనకారులను ఉత్తేజితులను చేశారు. కొత్త తరం, కొత్త రక్తం, అనాగరిక భావాలను, పాలనలను ఇంకెంతకాలం సహించాలంటూ, ఏలికలకు మానవత్వపు ఓనమాలు నేర్పడానికి ఉద్యమిస్తున్నది.

ఏమీ నష్టం లేదంటున్న ప్రభుత్వం ఏమి లాభమో మాత్రం చెప్పలేకపోతున్నది. నీ మనసులో ఉన్న కుట్ర ఇదీ అని నిలదీస్తుంటే, మాటవరస ఖండనలు ఇస్తుంది కానీ మరుక్షణమే మరో విచ్ఛిన్నకర ప్రకటన సిద్ధం. సిఎఎ, ఎన్ఆర్సీ కలిసి కదా ప్రమాదం, ఇప్పుడు ఎన్పీఆర్ మరో మాయలేడి. జనం వద్దంటున్న కొద్దీ అదే మాట మరో రూపంలో, అదే మోసం మరో వేషంలో. కుట్ర నిజమైనా కాకపోయినా, నీ పూర్వచరిత్ర నీ ప్రతిచర్యను అనుమానాస్పదం చేస్తుంది. బూచి అబద్ధం కావచ్చును కానీ, భయం వాస్తవం. పౌరసత్వపు కాగితాలను తనిఖీ చేస్తూ గెస్టపో పోలీసులు చేసే హంగామా, కాయితాలు లేని వారిని వ్యానుల్లో కుక్కి తరలించిన దృశ్యాలు, నాజీకాలపు ఇతివృత్తాల సినిమాలు చూసినవారికి తెలిసినవే. మనుషులను బానిసల కంటె, మృగాల కంటె హీనంగా పరిగణిస్తూ, వారిని విషవాయు గృహాల్లో తరలించి చంపిన దుర్మార్గం హిట్లర్‌ది. అటువంటి నరహంతకులు చివరకు కాలగర్భంలో చరిత్రహీనులుగా కలసిపోతారని తెలిసినా, ప్రపంచవ్యాప్తంగా నియోనాజీలు పుట్టుకువస్తూనే ఉన్నారు. మన దేశం కూడా హిట్లర్ యుగవైభవాన్ని చవిచూడాలా? ఆ వల్లకాటి అధ్వాన శకం వస్తుందేమోనని భయం. ఈ దేశంలోని 20 కోట్ల ప్రజల భయాందోళనలను, అవి భ్రమలే అనుకుందాం, ఎట్లా తొలగించకుండా ఉంటావు? అనునయం, ఉపశమనం, వివరణం వంటి మాటలే నీ నిఘంటువులో ఉండవా? ఎన్నిసార్లు ఎన్ని నల్లచట్టాలు తెచ్చి, ప్రజలు భయపడుతున్నారన్న పేరుపెట్టి, ఉపసంహరించుకోలేదు, ప్రజల్లో విశ్వాసం నింపడానికైనా.

అతిశయం పెరిగి, నోరూ కాలూ అన్నీ జారుతున్నాయి. అవరోహణం మొదలయ్యాక ఆగదు. అధినేతలు అసాధ్యులు కదా, వారికి అధికారం ఒక్కటే లక్ష్యం కాదు. కొందరిని చెరబట్టి, కొందరిని అణచిపెట్టి, మరి కొందరిని మాయలో పెట్టి– దేశంలోని ప్రతి ఆత్మనూ ఒక బందీనో, కీలుబొమ్మనో చేయగలిగితే అదే శాశ్వత అధికారాన్నిస్తుంది. అందుకని, కుట్రలు సశేషం. వేగం తగ్గిందని వేడుకపడకూడదు.

పౌరసత్వ చట్టంపై నిరసనల్లో వ్యక్తమైన సజీవ ఐక్యత– ఈ దేశానికి సరికొత్త హామీ ఇచ్చింది. శాంతి, సామరస్యం, సహజీవనం, పరస్పరత– ఈ విలువలు ఈ దేశంలో చాలా లోతుగా పాదుకుని ఉన్నాయి. వాటిని పెకిలించే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నా, వేళ్లు గట్టిగా ఉన్నాయి. కొత్తగా వస్తున్న విద్యావంతుల తరం, ఈ దేశవృక్షం కొమ్మల నుంచి ఊడలు దిగి, వేళ్లతో సంభాషిస్తున్నది. పోరాడవలసిన శత్రువులపై పోరాడతాం, సాంస్కృతికంగా సామాజికంగా సహజీవన విలువలను గౌరవిస్తూ, కొత్త సమీకరణలను నిర్మిస్తాం అని యువతరం చెబుతున్నది. శరణార్థుల విషయంలో అయినా సరే, మతపరమయిన వివక్ష ఎక్కడా ఉండకూడదనీ, అది రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నమైనదని యువత నమ్ముతున్నది, దాని కోసం నిలబడుతున్నది. ద్వేషంతో, భేదభావంతో, అజ్ఞానంతో చెడిపోయిన యువత లేదని కాదు. ఏ శక్తి తన సంకల్పంతో, ఐక్యతతో ముందుకు వెళ్లగలుగుతుందో దాన్నే పురోగామి శక్తి అంటాము.

అరుంధతీరాయ్ చెప్పినట్టు, శరణార్థులు, ముస్లిములు, వీళ్లే కాదు, దేశస్తులందరినీ పిటిషనర్లుగా మార్చడమే ఈ చట్టం ఉద్దేశ్యం. ప్రతి ఒక్కడిలో అభద్రతను సృష్టించాలి, పక్కవాడి మీద ద్వేషాన్ని కల్పించాలి. ఈ దేశ దారిద్ర్యానికి, పాతాళానికి పడిపోతున్న దేశవృద్ధి రేటుని మరచిపోయి, మతోన్మాదంలోనో జాతీయవాద ఉన్మాదంలోనో ప్రజలు పరవశించేట్టు చేయాలి, ముమ్ముందు ఒక మతతత్వ నియంతృత్వ కార్పొరేట్ రాజ్యాన్ని స్థాపించాలి.. ఇదే కదా అసలు అజెండా. అదేదో కనుచూపు మేరలోకి వచ్చిందని భయపడేవాళ్లు భయపడడం, సంతోషించే వాళ్లు సంతోషించడం జరిగాయి కానీ, స్టాక్‌మార్కెట్‌కు లాగా, రాజకీయ సంచలనాలకు కూడా కరెక్షన్లు ఉంటాయి. ఎంత పాడైపోయినా, కష్టించి నిర్మించుకున్న ఆధునిక సమాజం మౌలికంగా మంచివైపే ఉన్నదని గ్రహించిన తరువాత, గమనాన్ని సరిదిద్దుకోవడం అసాధ్యమేమీ కాదు. పెనుప్రమాదాన్ని నివారించే ఉత్సాహంలో, తనలోని విలక్షణతను, విభిన్నతను, సామరస్యతను ప్రదర్శిస్తూ, ఈ క్రమంలో మరిన్ని కొత్త విలువలను కూడా సమకూర్చుకుంటున్నది. పాలకులు తమ ప్రయాణంలో ఒక్కో మెట్టు ఎక్కకుండా చూడడమే దేశభక్తుల కర్తవ్యం. సామరస్యపు మాట, శాంతి వచనం ఇవి కూడా సహించని కాలం వచ్చింది కాబట్టి, ఇప్పుడు అంబేద్కర్, రాజ్యాంగం, గాంధీ– అందరూ మంచితనానికి సంకేతాలే. అభిప్రాయభేదాలు పక్కనబెట్టి, మువ్వన్నెల జెండాకు దాని స్ఫూర్తిని తిరిగి అద్దవలసిందే. విడదీసేవాడికి విడిపోనివాళ్లే జవాబు. ❑

# విశ్వ మానవుడి కోసం



**డా॥ విరించి విరివింటి**

నేనిప్పుడు చెప్పబోయేది కాస్త నింపాదిగా ఆలోచించ వలసిన విషయం. కులాలకూ మతాలకూ దేశ సరిహద్దులకూ అతీతంగా ఆలోచించవలసిన విషయం. ఏ మాత్రం ఏమరుపాటు గా ఉన్నా మన మనసుల్లోకి ఒక కిటికీ తెరుచుకుంటుంది కాబట్టి అన్ని కిటికీలూ మూసుకుని ఆలోచించవలసిన విషయం. మత, దేశ భావనలు అణువంత చిన్నగా మనసులోకి ప్రవేశించినా, మైకం కమ్మినట్టు నేను చెప్పేదంతా అబద్ధమైనట్టు తోచే విషయం. మానవుల ఆలోచనలు చాలా పెళుసైనవి. అత్యంత సులభంగా డిస్టార్ట్ కాగలిగినవి. అందుకే మనసును అదుపులో పెట్టుకోవడమైనా, లేక మైండ్ ఫుల్నెస్ ని సాధన చేయడమైనా మనుషులకు కష్ట సాధ్యాలైనాయి. అందుకే మరోసారి సకల మానసిక చింతనలూ కట్టి పెట్టి, బలవంతంగానైనా నేను చెప్పేది వినడానికి మీరు సంసిద్ధులు కావలసి ఉంటుంది.

చరిత్రలో బహుశా ఇంతకుముందు ఇప్పుడున్న ఇలాంటి పరిస్థితి మనుషులకు ఎదురుకాకపోయి ఉండవచ్చు. చరిత్రను మనం సాంతం చూడలేము కాబట్టి చరిత్రను పక్కకు పెట్టి, వర్తమానాన్ని ఉన్నది ఉన్నట్టుగా కల్పనలు లేకుండా పరికించి చూడవలసిన అవసరం ఉంది. ఎందుకంటే మతాలతో కక్షలతో కార్పణ్యాలతో మతాల జాతుల యుద్ధాలతో నిండిన చరిత్ర తేనె తుట్టెను కదిపితే ఏ ఒక్క తేనెటీగైనా వచ్చి మన మనసు చెవి దగ్గర రొద మొదలు పెట్టవచ్చు. లేదా చర్మం మీద కుడితే... బొబ్బలెక్కి అది శరీరమంతా ఉన్మాదంగా వ్యాప్తి చెందవచ్చు. అందుకే కాసేపటి కోసం మూసి ఉంచిన మన మనసు తలుపుల్నీ తలుపుల్నీ మూసే ఉంచి మాట్లాడుకుందాం. ప్రస్తుతం మానవుడు 190 దేశాల్లో నివసిస్తున్నాడు. అంటే 190 భాగాలుగా విడిపోయి ఉన్నాడు. ప్రతీ మానవుడు ఏదో ఒక దేశానికి చెందిన వాడే ఐవుంటున్నాడు. కానీ కొందరు మానవులు అసలు ఏ దేశానికీ చెందని వారై మిగిలిపోవడం ఇంతకుముందు కూడా ఉందేమో కానీ ప్రస్తుతం మనం కళ్ళారా చూస్తున్నాం. ఏ దేశమూ లేని వారికి బతకడానికి ఏదో ఒక చోటు ఉండాలి కదా!?. ఇది నిజంగా మానవాళి ముందు ఉన్న సమస్యే కదా?!. ఎన్నో సమస్యలకు పరిష్కారం కనుక్కునే మానవుడు ఈ సమస్యకు కూడా పరిష్కారం కనుగొంటాడనే నమ్మకంతో ముందుకు సాగుదాం.

నిలబడటానికి కాసింత జాగా లేని వారు..ఏ దేశమూ లేని వారు ఇదొక్కటే సమస్య కాదు..దీనితో పాటు వచ్చే సమస్యలు ఎన్నో...అవన్నీ ఒక సముద్రంలాగా ఒక అల తర్వాత ఒకటిలా వచ్చి పడతాయి. ఆ సముద్రపు అలల కింద నలిగి ఈదలేక శవాల్లా ఒడ్డుకు కొట్టుకు వస్తాయి కొన్ని ప్రాణాలు. మూడేళ్ళ సిరియన్ బాలుడు అలాన్ కుర్దీ గుర్తున్నాడు కదూ!. జీవితాన్ని ఇంకా చూడక ముందే...అమ్మ వొడినుంచి దిగి ఆటలు ఆడేందుకు ఉవ్విళ్ళూరుతున్న సమయంలోనే తన దేశంనుంచి పారిపోవలసిన అవసరం ఎందుకొచ్చింది?. ఎన్నో దేశాల్లో అంతర్గత పోరాటాలు, జాతి, మత సంఘర్షణలు ఎందుకు పుడుతున్నాయో గానీ అక్కడి బలహీనులను దేశ రహిత మానవులుగా చేస్తున్నాయి. ఆ దేశంలో ఉండలేక, పుట్టిన పాపానికి పొట్ట చేతిలో పట్టుకుని ప్రాణాలు గుప్పిట్లో పట్టుకుని, ఏ మనసుగల దేశమైనా మాకింత అన్నం పెట్టకపోతుందా అని కనబడిన దారెంబడి పరిగెత్తేలా చేస్తుంది. వాళ్ళకు మన మానవ సమాజం అందంగా పెట్టిన పేరు- శరణార్థులు. వికృతంగా పెట్టిన పేరు- అక్రమ వలసకారులు. సిరియా దేశంలోని అంతర్గత పోరును, జాతి వైరాల్ని భరించలేక వేల మంది దిక్కున్న చోటికి వలసలు కట్టారు. కొందరు సముద్ర మార్గం ద్వారా ఏదో దేశానికి ఐతే పోయి బలుసాకు తినొచ్చని కనిపించిన పడవల్లోకెళ్ళా ఎక్కి కూర్చున్నారు. దేశాలే కాదు, సముద్రాలూ, పడవలూ కూడా మోసం చేశాయి...అలాన్ కుర్దీలాగా ముక్కుపచ్చలారని పసి పిల్లలు కూడా ఒడ్డున శవాలై తేలారు. అలాన్ కుర్దీ మనకు కనిపించాడు...అంతే..!. కనిపించని అన్ డాక్యుమెంటెడ్ అలాన్ లు ఎందరో!!. ఐతే అలాన్ కుర్దీ మౌనంగా ఆ మెడిటెర్రేనియన్ సముద్రపు ఇసుక తిన్నెల మీద ముఖం చాటేస్తూ బోర్లా పడి ఉండటం చూసిన ఓ గినియా బిస్సూ కవయిత్రి “యవోంకా పెర్డిగో” తన బాల్యపు అదృష్టపు రోజులనూ మొదనష్టపు రోజులనూ గుర్తుకు తెచ్చుకుంటుంది. గినియా బసూ నుంచి ఫ్రాన్స్‌కు పోయే ఓ ఓడను చేరుకునే సమయంలో శరణార్థులైన వీళ్ళ మీద బాంబు దాడులు జరిగాయట. ఒడ్డు మీది నుంచి ఆ ఓడను చేరడానికి ప్లాస్టిక్ పడవలల్లో పోవాలంట. సముద్రం మీద బాంబులు పడినప్పుడల్లా ఆ చిన్న పడవ ఊగిపోతుంటే...భయం భయంతో ఆమె చెల్లెలూ, నాయనమ్మా

తనను గట్టిగా పట్టుకుని కూర్చున్నారట. మరణానికి సంబంధించిన ఆ భయాన్ని తాను మరచిపోలేదేమో ఎప్పటికీ. ఆమె అలాన్ విగత శరీరాన్ని చూసి తానెంత అదృష్టవంతురాలినో నని తప్పక అనుకుని ఉండింటుంది. ఎందుకంటే అలాన్ ప్రయాణించే ఓడ మునిగిపోయినప్పుడు మొత్తం చనిపోయిన వారి సంఖ్య 3770. ఎన్ని హృదయ విదారక మానవ కథలను ఆ తల్లి సముద్రం మోసిందో!. అలాన్ ఒక్కడినీ ఒడ్డుకు పంపి మనుషుల్లారా ఒకసారి ఆలోచించుకోండని మనతో ఘోషించిందేమో... అది సముద్ర ఘోష ఎవరికీ అర్థం కాలేదిప్పటి దాకా!.

సమస్య ఏమిటంటే మనకెవ్వరికీ శరణార్థుల కష్టాలు తెలియవు. అప్పటిదాకా బాగున్న జీవితం ఉన్నపళంగా మారి జీవన్మరణాలమధ్య ఊగిసలాడటం ఎంత భయంకరంగా ఉంటుందో అది మనసులో ఎంత లోతైన గాయం చేస్తుందో మనకు తెలియదు. ప్రపంచమంతా వాళ్ళ బాధను కించిత్తూ అర్థం చేసుకోకున్నా...ప్రపంచం మాత్రం వాళ్ళను పద్ధతిగా బతకమని, ఇతరులను గౌరవించడం నేర్చుకోమని చెప్పడం బహుశా వాళ్ళకు విచిత్రంగా ఉంటుందేమో!. క్యాలిఫోర్నియా ప్రొఫెసర్ బెవెర్లీ క్రాఫోర్డ్ ఏమంటారంటే శరణార్థులకు మూడు జీవితాలుంటాయని. వాళ్ళు త్రిజులు. మొదట జాతి వైరం వల్లనో మత వైరంవల్లనో వివక్షకు గురికాబడిన దేశంలోని జీవితం. మానవ హక్కులు పూర్తిగా హరింపబడి, సివిల్ వార్‌లో సర్వమూ కోల్పోయి, ఆకలితో అలమటింపజేసిన దేశం. ఆ దేశంలో ఇక జీవించడం భరింపరానిదిగా మారేంత దాకా తెగించి జీవించిన జీవితం. ఆ తర్వాత, ఇక్కడ జీవించలేం, మరో దేశానికి పారిపోదాం అనుకున్న తరుణం నుంచి మొదలయ్యేది రెండో జీవితం. అధికారుల కన్ను గప్పి భార్యా బిడ్డలతో సహా సరిహద్దులు దాటే ఓ భయంకర ఘట్టం. సముద్రాలూ, పర్వతాలూ దాటాలి. బార్డరులో ఇరు వైపులా కాచుకుని ఉన్న సైనికుల కళ్ళలో పడకుండా నల్లిలా పిల్లిలా పాకుతూ పోయే హీనాతి హీనమైన మానవజీవితం. ఎందరో అధికారుల బూట్ల కిందే నలిగి పోవచ్చు. ఏ పర్వతాల మిద చలి గాలులో సముద్రపుటలలో పిల్లలను పొట్టన పెట్టుకోవచ్చు. ఏ పేరో తెలియని సంచార జంతువుల్లాగా కుటుంబంలో బతికినవాళ్ళను బతకనిస్తూ చనిపోయిన వాళ్ళను చనిపోనిస్తూ నిర్దయగా కనిపించని ఓ స్వర్గం కోసం కన్న ఓ కల కోసం గుండె దిటువు చేసుకుని సాగాల్సిన తరుణం. పక్క దేశంలో బంధువుల సహకారం ఇమిగ్రేషన్ అధికారుల వద్ద వినతి పత్రాలుగా మాత్రమే బల్లమీద పడి ఉండవచ్చు. ఈ సంచార ప్రాణులను కాపాడతామని ఎన్ని నరహంతక మూకలు జమ కడుతుంటాయో, సహాయం పేర ఎందరు స్త్రీల మాన ప్రాణాలు హరించవేయబడతాయో!. ప్రతీ చోటా కాచుకుని కూర్చునే మానవ మృగాలకు శరణార్థుల స్త్రీలు అదనంగా దొరికే లడ్డూ మిఠాయిలు. మరో దేశం చేరిన తరువాత మూడో జీవితం మొదలౌతుంది. అక్కడి జనాలు వీళ్ళ ఉనికిని సహించక పోవచ్చు. వీళ్ళ మతాన్నీ, సంస్కృతినీ సహించక పోవచ్చు. రేషన్ కార్డులు లేక, వోటరు కార్డులు లేక కనీసం ఈ కొత్త దేశంలో మనుషులుగా కూడా గుర్తింపుకు నోచుకోకపోవచ్చు. తినడానికి తిండి లేక ఇళ్ళల్లో పాచి పనులు చేసుకుంటూ కొత్త దేశంలో కొత్త ఆశలతో దొరికిన ఆ కాస్త జాగాలో తమ నిదురలను కొత్త కలలతో నింపుకోవచ్చు. వాళ్ళ సొంతదేశంలో చదివిన డిగ్రీలను ఈ కొత్త దేశ యూనివర్సిటీలు గుర్తించకపోవచ్చు. అక్కడి డాక్టరైనా ఇంజనీరైనా ఇక్కడ చిన్న చిన్న పనులు తప్ప మరేమీ చేయడానికి వీలు లేదు. శరణార్థి శిబిరాలలో గుంపులు గుంపులుగా పశువులను కుక్కినట్టు కుక్కినా, రెండు కాళ్ళ మీద నిలబడేంత జాగా ఐనా ఈ భూమి మీద దొరికినందుకు కృతజ్ఞతలు చెప్పుకోవచ్చు. శరణార్థి శిబిరాలలో జ్వరాలు వస్తే, అవి దావాలనంలా వ్యాపిస్తే మూకుమ్మడిగా చచ్చిపోవచ్చు. గుర్తింపు లేని మనుషులను ఏ గవర్నమెంట్ డాక్టరూ ట్రీట్‌మెంట్ చేయడానికి లేదు. ఫోన్ నంబర్ ఐడెంటిటీ కార్డులతో సహా పేషెంట్ వివరాలను రాసుకునే దేశాల్లో ఉచిత చికిత్స జరిగే అవకాశమే లేకపోవచ్చు. ప్రైవేటు వైద్యం కొనుక్కోలేక ఎన్నో ఊపిరులు ఆ కొత్త దేశపు గాలిలో కలిసిపోవచ్చు. పని లేక ఆకలితో అలమటిస్తూ ఏ దొంగతనం చేసి పట్టుబడ్డా, శరణార్థి వెంటనే అక్రమ చొరబాటుదారుడై పోవచ్చు. క్రిమినల్ రికార్డుందా, టెర్రరిస్టు కార్యకలాపాలేమైనా ఉన్నాయా?. ఏ ఇంట్లో ఏ మత గ్రంథం ఉంది?. అనే సవాలక్ష ప్రశ్నలూ ఉదయించవచ్చు. లోకం ఎంత చెడ్డదో ఎంతగా చెడిపోయిందో ఈ అనుమానాల్లో కనబడుతుంటుంది.

అందుకే ఇప్పుడు గొప్ప దేశాలు అనబడే దేశాలు శరణార్థులను లేదా అక్రమ చొరబాటుదారులను గుర్తించమని అంటున్నాయి. బార్డర్ల దగ్గర గేట్లు మూసేస్తున్నాయి. గోడలు కట్టుకుంటున్నాయి.

ఒక్క సిరియా నుంచి ఒక కోటి మంది శరణార్థులుగా బయలు దేరారు. ఎందరో మధ్యలో చనిపోయారు. ఇంకా చనిపోతున్నారు. కేవలం బతకడం కోసం... ఊపిరి పీల్చుకోవడం కోసం సిరియాను వదిలి సాటి మనుషులుండే ప్రపంచం వైపు కదులుతున్నారు. అమెరికా 18007 శరణార్థులను మాత్రమే ఒప్పుకోగలిగింది. జనవరి 27, 2017 న డోనాల్డ్ ట్రంప్ సిరియా

నుంచి ఒక్క శరణార్థి కూడా రావడానికి వీలు లేదని పాలనా చట్టం తెచ్చాడు. " దేశాన్ని టెర్రరిస్టుల బారి నుంచి కాపాడటం కోసం" అని దానిని సమర్థించుకున్నాడు. ఎలాన్ కుర్దీ వంటి పసి పిల్లలు, వాళ్ళను కడుపులో దాచుకుని భయంకర సముద్రాల్ని దాటిన తల్లిదండ్రులు అందరూ ట్రంప్‌కు టెర్రరిస్టులుగా కనిపించారేమో!. సిరియాలో 2011 లో బషీర్ అల్ అసద్ తన సొంత ప్రజల మీదే కత్తి కట్టిన తరువాత 2015 వరకు 4,70,000 మంది ప్రజలు అక్కడ చనిపోయారని అమెరికాకు తెలుసు. మిగిలిన వాళ్ళు పొట్ట చేత పట్టుకుని శరణార్థులై వస్తుంటే వాళ్ళంతా టెర్రరిస్టులంటాడు ట్రంప్. ఎవరిని మెప్పించడానికి అన్నాడో గానీ తన మనసును ఒప్పించే అని ఉంటాడా!? అని మనం ఆలోచించాలి. సిరియా నుంచి వివిధ దేశాల వైపు శరణార్థులు పరుగులు పెట్టారు. టర్కీలో 27 లక్షల మంది శరణార్థులు చేరారు. జోర్డాన్, లెబనాన్, ఇరాక్ లూ శరణార్థులను ఆహ్వానించాయి. కానీ శరణార్థుల సంఖ్యలు పెరిగిపోతుండటంతో ఆయా దేశాల ప్రజల సెంటిమెంట్లు ప్రాథమ్యాలు కూడా మెల్లగా మారిపోవడం మొదలైంది. భీకర సముద్రం భయపెడుతున్నా సాహసోపేతంగా సిరియా నుండి యూరోపు వైపూ కదిలారు కొందరు. జర్మనీ, స్వీడెన్, హంగరీ, ఆస్ట్రియా వంటి దేశాలు we welcome refugees ప్లకార్డులూ, బ్యానర్లూ పట్టుకుని నిలబడ్డాయి. మాది వెల్కం సంస్కృతి అని అక్కడి ప్రజలు గొప్పగా చెప్పుకున్నారు. వేల సంఖ్యలో శరణార్థులు చేరారు. దాదాపు 2.5 లక్షల శరణార్థులు వివిధ దేశాల్లో అక్కడి శిబిరాల్లో చేరి ఆశ్రయం పొందుతున్నారు. కానీ మానవులు పెరిగే కొద్దీ వనరుల కొరతా పెరగడంతో...ఆహ్వానించిన దేశాలే ఇక రాకండని చెప్పడం మొదలెట్టాయి. సిరియా శరణార్థులను రానీయకుండా హంగరీ మొట్టమొదటగా ముళ్ళ గోడను కట్టింది. అన్ని దేశాలూ కట్టడం మొదలు పెట్టాయి. ఐనా ఎవరైనా వస్తే వాళ్ళను అక్రమ వలసదారులని చెప్పి జైళ్ళలో నిర్బంధించాయి.

ఇప్పుడు చెప్పండి...శరణార్థులను ఏ దేశమూ రానీయకపోతే వాళ్ళంతా ఎక్కడకు పోవాలి?. ఏ సముద్రంలోకి దూకి చావాలి?. ఇంత పెద్ద ప్రపంచంలో ఒక్క చోట కూడా వాళ్ళకి ఆహారం దొరకకపోతే...ఎట్లా?. ఇది మానవాళి ముందున్న అతి పెద్ద సమస్య ఔనా కాదా?. చరిత్రనంతా పక్కకు పెడదాం.. ప్రస్తుతం మానవాళి ఈ సమస్యను పరిష్కరించుకునే ముందుకు కదలాల్సి ఉంటుంది. ఎందుకంటే దేశాలమధ్య కాన్ఫ్లిక్ట్‌లూ దేశాల్లో అంతర్గత వివాదాలూ రోజు రోజుకీ పెరుగుతూనే ఉన్నాయి...చాలా దేశాలు సివిల్ వార్ అంచుల మీద నిలబడి ఉన్నాయి. సిరియా, యెమెన్, అఫ్ఘానిస్థాన్, ఇరాన్, ఇరాక్, లిబియా, సోమాలియా, సూడాన్, మెక్సికోలలో అధిక సంఖ్యలో మరణాలు ఈ రోజుకీ జరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పాలకులు విభజించు- పాలించు అనే ధోరణిలో అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నారు. జాతుల మధ్య, మతాల మధ్య, తరగతుల మధ్య, కులాల మధ్యా చిచ్చు పెడితేనే గానీ అధికారంలోకి రాలేమనే భ్రమలో పాలకులున్నారు. ఇప్పుడు మేల్కోవలసింది ఎవరు?. ఈ చిచ్చు దావానలంలా ప్రతీ చోటా వ్యాపిస్తోంది. ప్రతీ దేశంలో వ్యాపిస్తోంది. ప్రతీ హృదయాన్నీ కలుషితం చేస్తోంది.రాబోయే కాలమంతా సివిల్ వార్‌లు జాతి పేరుతో మతం పేరుతో ఉత్పన్నమైతే రాబోయే తరాల జీవితం శరణార్థులుగానే తప్ప మరో రకంగా ఉండకపోతే ఈ భూమి మీద ఎలా ఉండబోతోంది. ఈ భూమే నివాస యోగ్యంగా కానప్పుడు ఏ గ్రహాలకు శరణార్థులు పారిపోవాలి!?. యునిసెఫ్ ఇప్పటికే బాల్యాన్ని కోల్పోయిన ఎందరో శరణార్థి చిన్నారులను గుర్తించింది. "lost generation"ని చూసి తన వంతు సహాయంగా శరణార్థి శిబిరాలలోని పిల్లలకు చదువు నేర్పిస్తోంది. వాళ్ళ శారీరక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఒక తరాన్ని కాపాడే ప్రయత్నం చేస్తోంది. ఇప్పుడు మనముందున్న సమస్యంతా ఇంకెంత మంది శరణార్థులను ఈ ప్రపంచం పుట్టించబోతోంది?. శరణార్థుల పేరిట ఎంతమందిని తమ జాత్యాహంకారాల కింద నలిచి పడేయనుంది!. మనుషులను మతాలుగా జాతులుగా విభజించే భావజాలాల్ని ఆ పాలకులనూ ఇంకా ఎంతకాలం ప్రజలు భరించనున్నారు. ఏ మత గ్రంథం విశ్వాన్నంతటిని అక్కున చేర్చుకోగల విశ్వ మానవులను తయారు చేయగలుగుతోంది!?. ఏ విద్య మనుషులను ఉన్నతంగా చేయబోతోంది?. శరణార్థులను కాపాడుకోవడం ఒక ఎత్తైతే..అసలు శరణార్థులే లేని ప్రపంచాన్ని మనం కల గనలేమా?. డివిసివ్ ఫోర్సెస్ ని అన్నింటినీ విధ్వంసం చేసి విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పుకోలేమా?!. ఎలాన్ కుర్దీ ని బతికించుకోలేమా?!.

ఏయ్..ఏయ్లాన్ కుర్దీ..
మా బంగారు తండ్రీ!!
ఒక్కసారైనా లేచి చూడవేమిరా!?
ఒక్కసారి లేచి నీ కథను చెప్పవేమిరా?

ఏ దేశపు మకిలీ నీకింకా అంటనేలేదు
ఏ మత మైకమూ నిన్ను తాకనేలేదు
ఇసుక తెన్నెలలోకి ముఖాన్ని దూర్చి

☞ మిగతా 17వ పేజీలో

# Bill Summary PRS

## The Citizenship (Amendment) Bill, 2019

- The Citizenship (Amendment) Bill, 2019 was introduced in Lok Sabha by the Minister of Home Affairs, Mr. Amit Shah, on December 9, 2019. The Bill seeks to amend the Citizenship Act, 1955.
- The Citizenship Act, 1955 provides various ways in which citizenship may be acquired. It provides for citizenship by birth, descent, registration, naturalisation and by incorporation of territory into India. In addition, it regulates the registration of Overseas Citizen of India Cardholders (OCIs), and their rights. An OCI is entitled to some benefits such as a multiple-entry, multi-purpose lifelong visa to visit India.
- **Definition of illegal migrants:** The Act prohibits illegal migrants from acquiring Indian citizenship. It defines an illegal migrant as a foreigner: (i) who enters India without a valid passport or travel documents, or (ii) stays beyond the permitted time.
- The Bill amends the Act to provide that that the Hindus, Sikhs, Buddhists, Jains, Parsis and Christians from Afghanistan, Bangladesh and Pakistan, who entered India on or before December 31, 2014, will not be treated as illegal migrants. In order to get this benefit, they must have also been exempted from the Foreigners Act, 1946 and the Passport (Entry into India) Act, 1920 by the central government. The 1920 Act mandates foreigners to carry passport, while the1946 Act regulates the entry and departure of foreigners in India.
- **Citizenship by registration or naturalisation:** The Act allows a person to apply for citizenship by registration or naturalisation, if the person meets certain qualifications. For instance, if a person resides in India for a year and if one of his parents is a former Indian citizen, he may apply for citizenship by registration.
- To obtain citizenship by naturalisation, one of the qualifications is that the person must have resided in India or have been in service of the central government for at least 11 years before applying for citizenship.
- The Bill creates an exception for Hindus, Sikhs, Buddhists, Jains, Parsis and Christians from Afghanistan, Bangladesh and Pakistan, with regard to this qualification. For these groups of persons, the 11 years' requirement will be reduced to five years.
- On acquiring citizenship: (i) such persons will be deemed to be citizens of India from the date of their entry into India, and (ii) all legal proceedings against them in respect of their illegal migration or citizenship will be closed.
- These provisions on citizenship for illegal migrants will not apply to the tribal areas of Assam, Meghalaya, Mizoram, and Tripura, included in the Sixth Schedule to the Constitution. These tribal areas include Karbi Anglong (in Assam), Garo Hills (in Meghalaya), Chakma District (in Mizoram), and Tripura Tribal Areas District. Further, it will not apply to the "Inner Line" areas notified under the Bengal Eastern Frontier Regulation, 1873. In these areas, visits by Indians are regulated through the Inner Line Permit. Currently, this permit system is applicable to Arunachal Pradesh, Mizoram, and Nagaland.
- **Cancellation of registration of OCIs :** The Act provides that the central government may cancel registration of OCIs on certain grounds. These include: (i) if the OCI has registered through fraud, or (ii) if within five years of registration, the OCI has been sentenced to imprisonment for two years or more, or (iii) if it becomes necessary in the interest of sovereignty and security of India. The Bill adds one more ground

for cancelling registration, that is, if the OCI has violated the provisions of the Act or of any other law as notified by the central government. The orders for cancellation of OCI should not be passed till the OCI cardholder is given an opportunity to be heard.

- **Issues to consider**
- **Whether differentiating on grounds of religion is a violation of Article 14**
- The Bill provides that illegal migrants who fulfil four conditions will not be treated as illegal migrants under the Act. The conditions are: (a) they are Hindus, Sikhs, Buddhists, Jains, Parsis or Christians; (b) they are from Afghanistan, Bangladesh or Pakistan; (c) they entered India on or before December 31, 2014; (d) they are not in certain tribal areas of Assam, Meghalaya, Mizoram, or Tripura included in the Sixth Schedule to the Constitution, or areas under the "Inner Line" permit, i.e., Arunachal Pradesh, Mizoram, and Nagaland.
- Article 14 guarantees equality to all persons, including citizens and foreigners. It only permits laws to differentiate between groups of people if the rationale for doing so serves a reasonable purpose.[6] The question is whether this provision violates the right to equality under Article 14 of the Constitution as it provides differential treatment to illegal migrants on the basis of (a) their country of origin, (b) religion, (c) date of entry into India, and (d) place of residence in India. We examine below whether these differentiating factors could serve a reasonable purpose.
- First, the Bill classifies migrants based on their country of origin to include only Afghanistan, Pakistan and Bangladesh. The Statement of Objects and Reasons in the Bill (SoR) states that India has had historic migration of people with Afghanistan, Pakistan and Bangladesh, and these countries have a state religion, which has resulted in religious persecution of minority groups. While the SoR reasons that millions of citizens of undivided India were living in Pakistan and Bangladesh, no reason has been provided to explain the inclusion of Afghanistan.
- Further, it is not clear why migrants from these countries are differentiated from migrants from other neighbouring countries such as Sri Lanka (Buddhist state religion)[7] and Myanmar (primacy to Buddhism)[8]. Sri Lanka has had a history of persecution of a linguistic minority in the country, the Tamil Eelams.[9] Similarly, India shares a border with Myanmar, which has had a history of persecution of a religious minority, the Rohingya Muslims.[10] Over the years, there have been reports of both Tamil Eelams and Rohingya Muslims fleeing persecution from their respective countries and seeking refuge in India.[11] Given that the objective of the Bill is to provide citizenship to migrants escaping from religious persecution, it is not clear why illegal migrants belonging to religious minorities from these countries have been excluded from the Bill.
- Second, with respect to classification based on religious persecution of certain minorities in Pakistan, Afghanistan and Bangladesh, it may be argued that there are other religious minorities in these countries, who face religious persecution and may have illegally migrated to India. For example, over the years, there have been reports of persecution of Ahmadiyya Muslims in Pakistan (who are considered non-Muslims in that country)[12], and the murder of atheists in Bangladesh.[13] It is unclear why illegal migrants from only six specified religious minorities have been included in the Bill.
- Third, it is also unclear why there is a differential treatment of migrants based on their date of entry into India, i.e., whether they entered India before or after December 31, 2014.
- Fourth, the Bill also excludes illegal migrants residing in areas covered by the Sixth Schedule, that is, notified tribal areas in Assam, Meghalaya, Mizoram and Tripura. The purpose behind the enactment of the Sixth Schedule of the Constitution was to aid in the development of tribal areas through autonomous councils,

while protecting the indigenous population in these areas from exploitation and preserving their distinct social customs.[14] The Bill also excludes the Inner Line Permit areas. Inner Line regulates the entry of persons, including Indian citizens, into Arunachal Pradesh, Mizoram and Nagaland. Once an illegal migrant residing in these areas acquires citizenship, he would be subject to the same restrictions in these areas, as are applicable to other Indian citizens. Therefore, it is unclear why the Bill excludes illegal migrants residing in these areas.

- **Wide discretion to government to cancel OCI registration**
- The 1955 Act provides that the central government may cancel the registration of OCIs on various grounds. The Bill adds one more ground for cancelling registration, that is, if the OCI has violated any law notified by the central government. It further states that orders for cancellation of OCI should not be passed till the cardholder is given an opportunity to be heard.
- It may be argued that giving the central government the power to prescribe the list of laws whose violation result in cancellation of OCI registration, may amount to an excessive delegation of powers by the legislature. The Supreme Court has held that while delegating powers to an executive authority, the legislature must prescribe a policy, standard, or rule for their guidance, which will set limits on the authority's powers and not give them arbitrary discretion to decide how to frame the rules.[15] The Bill does not provide any guidance on the nature of laws which the central government may notify. Therefore, in the absence of standards, criteria or principles on the types of laws which may be notified by the government, it may be argued that the powers given to the executive may go beyond the permissible limits of valid delegation.

❑

---

## విశ్వ మానవుడి కోసం

**(14వ పేజీ తరువాయి)**

ఈ పాపిష్టి లోకం మీదే అలిగావారా బుజ్జీ!!
నీ చిన్ని ఆటల మైదానం
మానవ హృదయాలకంటే ఎంత విశాలమైనదిరా!?
సరిహద్దుల మీద తచ్చాడే వాళ్ళందరూ
చొరబాటుదారులు కాదని ఒక్కసారి చెప్పరా!
చోటు కోసం నిలువ నీడ కోసం
కడుపుకు కాసిన్ని పాలకోసం
ఎంత తపించినావో..
భూమి తల్లికి పాలిండ్లు ఎండిపోయినాయని
ఏడుస్తూ చెప్పవేమిరా!?.
నేలకూ, నింగికీ
సముద్రాలకూ, పర్వతాలకూ
మనుషులకూ జంతువులకూ
అన్నింటికీ పౌరసత్వమున్న ప్రపంచంరా ఇది.
ఇపుడే పుట్టిన పిల్లలకు పౌరసత్వమేంటని అడగవేమిరా?!

ఎలాన్ కుర్దీ...ప్రపంచం ముందుకు ఒక ప్రశ్న లేవనెత్తాడు. మనం విశ్వ నరులం కాలేమా అనే ప్రశ్న మనల్ని మనలో అడుక్కొని మనలోనే సమాధానం కనుక్కోమంటున్నాడు. రోజురోజుకూ పెరుగుతున్న విభజన శక్తులు ముందు తరాలను ఏ ప్రపంచం వైపు నడిపించబోతున్నాయో మరోసారి సరి చూసుకోమంటున్నాడు. వాడు ఈ ప్రపంచాన్ని చూడలేక ముఖం దాచుకుని వెళ్ళిపోయాడు. మనం ప్రపంచంలోకి కొత్త మానవులను ఆహ్వానించవలసి ఉంది. ప్రపంచాన్ని వాళ్ళ కోసం సుందరంగా నివాసయోగ్యంగా మలచాల్సి ఉంది. ఔను..ఆ బాధ్యత మనమీద ఉంది.

(ఈ పోస్ట్ నా కోసం నా అనుకున్న వారి కోసం ..కొద్దిగా నాలాగే ఆలోచిస్తారనుకునే ఆ కొద్దిమంది కోసం రాసుకున్నాను. ఎలాన్ కుర్దీ నాతో మాట్లాడాడనుకుని రాసుకున్నాను. దీనిలో కూడా తమ రాజకీయ ప్రాథమ్యాలను చూస్తూ మరో డివిజివ్ ఫోర్స్‌కి ఊతంగా కామెంట్ చేయకండని, ఎలాన్ కుర్దీని అవమానించకండని కొందరిని కోరుతున్నాను. ఆ విద్వేషపు మాటలను భరించే స్థితిలో లేను. ప్లీజ్!) ❑

# మతం పేరిట దౌర్జన్యాలు ఆధిపత్యం కోసమే !



**డాక్టర్ దేవరాజు మహారాజు**
సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్సు ప్రొఫెసర్

అన్ని కులాల వాళ్ళూ, అన్ని వర్గాల వాళ్ళూ, అన్ని ప్రాంతాల వాళ్ళూ, అన్ని దేశాల వాళ్ళూ మనుషులే! భేదాలు, వర్గీకరణలు మరచి మానవజాతి అంతా ఒకటేనన్న విశాలత్వంలోకి ఎదగాల్సింది పోయి, ఒక కులం వాడు మరో కులాన్ని ఎద్దేవా చేయడం, ఒక ప్రాంతం వాడు మరో ప్రాంతం వాడిని అవహేళన చేయడం వల్ల సాధించేదేముంది? వైషమ్యాలు, కక్షలు, కార్పణ్యాలు తప్ప? మామూలు మనుషులంటే పరిపక్వత లేని వాళ్ళని అనుకుందాం. సర్వసంగ పరిత్యాగులమని ప్రకటించుకుని, ఎవరికి వారు చిన్న చిన్న ఆధ్యాత్మిక సామ్రాజ్యాలు నిర్మించుకున్న వారికి సహనం ఉండాలి కదా? జ్ఞానబోధ ఎలా చేస్తారూ? రాగద్వేషాలకు అతీతంగా, ఓపిగ్గా, సగటు మనిషి కంటే ఎన్నో రెట్లు ఎదిగి కదా చెయ్యాలీ? సగటు మనిషి కంటే అధ్వాన్నంగా తైతక్కలాడుతూ ఆక్రోషం వెళ్ళగక్కితే ఇంక అతనేం సాధువూ? అతనేం స్వామీజీ? ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్కృతిని ప్రోత్సహిస్తూ, బాబాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పుడు బాధ్యత మరి ఎవరి మీద ఉంటుంది? సామాన్య జనం మీదే కదా ఉండేదీ? అందువల్ల సామాన్య జనమే తెలివి పెంచుకోవాలి. మూఢత్వంలో కొట్టుకుపోతూ, ఎవడి చుట్టో తిరగకుండా, హేతుబద్ధంగా నిలబడడం నేర్చుకోవాలి. ఎందుకంటే జనబాహుళ్యం ముందు ఎంతటి వాడైనా దిగదుడుపే – స్వామీజీ / బాబా / రాజ్యాధినేత ఎవరైనా సరే ! వైజ్ఞానిక స్పృహ పెరగాలని అంటున్నది అందుకే –

ఒక్కసారి గతంలోకి వెళ్ళి ఈ దేశంలో మతాలు ఏం చేశాయో, భక్తి ఉద్యమాలు ఎందుకొచ్చాయో చూద్దాం – క్రీ.శ. 1117లో జన్మించాడని భావించబడుతూ ఉన్న రామానుజాచార్యుని మతాన్ని రామానందుడు అతని శిష్యులైన కబీరు, గురు రవిదాసు మొదలైన పన్నెండు మంది భక్త కవులు ఉత్తర – మధ్య భారతదేశంలో విస్తృతంగా భక్తి ఉద్యమాలు నిర్వహించారు. ఈ పన్నెండు మంది భక్త కవులలో ఎనిమిది మంది చేనేత, జాట్, చమార్ వంటి శూద్ర కులాలలో పుట్టినవారు. కబీరు చేనేత కులంలో పుడితే, గురు రవిదాస్ చమార్ (మాదిగ) కులంలో పుట్టాడు. ఈ గురు రవిదాస్, భక్తురాలైన మీరాబాయికి గురువు. ఆ కాలంలో ఢిల్లీని పరిపాలిస్తున్న సికిందర్ లోడి క్రీ.శ. 1276లో కాశికి వచ్చి, అక్కడ గురు రవిదాస్ వద్ద జ్ఞానబోధ పొందాడు. అందుకు గుర్తుగా లోడి కాశిలో జ్ఞానవాపి మసీదు నిర్మించాడు. ఇలా రాజులు, ప్రజలు భక్త కవులను అమితంగా గౌరవించుకునేవారు. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందేమంటే శూద్ర కుల భక్త కవులను కూడా గౌరవించేవారు. అయితే వర్ణవాద బ్రాహ్మణులు నిరంతరం వీరిని వ్యతిరేకిస్తూనే వచ్చారు. ఎన్నో కష్టనష్టాలకు గురిచేస్తూ వచ్చారు. భక్త తుకారాం మహారాష్ట్రలో బ్రాహ్మణులతో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడని, కష్టాలపాలయ్యాడని మనకు తెలుసు.

ఒక సందర్భంలో రామానుజాచార్యులు జైనమతస్థుడైన మైసూరు రాజు వెల్లాల రాయని కూతురు ఆరోగ్యం బాగు చేస్తాడు. ఫలితంగా రాజు వైష్ణవ దీక్ష తీసుకోవాలని కోరతాడు. జైనమతం యుద్ధాలకు వ్యతిరేకం కాబట్టి, వెల్లాల రాయుడు వైష్ణవ దీక్ష తీసుకుని దండయాత్రలు చేస్తాడు. రాజ్యాన్ని విస్తరించుకుంటాడు. అంతదాకా జైన దేవాలయమైన తిరుపతి ఆలయాన్ని స్వాధీన పరుచుకుని, దాన్ని వైష్ణవాలయంగా మార్చాడు. అది బాలాజీ గుడిగా, వేంకటేశ్వరాలయంగా ప్రాచుర్యంలోకి వచ్చింది.

ఇకపోతే వీరశైవం గురించి, వీర వైష్ణవం గురించి చరిత్రలో చాలా వివరాలున్నాయి. బసవడు – బిజ్జలుడనే రాజు దగ్గర మహామంత్రిగా ఉండేవాడు బసవడు నమ్మకంగా రాజును నమ్మించి, హత్య చేస్తాడు. కారణం రాజ్యకాంక్షే ! బిజ్జలుని రాజ్యాన్ని కైవసం చేసుకుని తనను తాను రాజుగా ప్రకటించుకుంటాడు. వీరశైవం అనే మతాన్ని వ్యాప్తిలోకి తెచ్చి, దాన్ని అడ్డు పెట్టుకుని జైనులను హింసించి, చంపి వారి ఆలయాలను శివాలయాలుగా మార్చేశాడు. రాజ్యవిస్తరణ కోసమే, రాజకీయ ప్రయోజనాల కోసమే 'వీరశైవం' అనే పేరు పెట్టుకుని పరిపాలన సాగించాడు. తన ప్రాభవం పెంచుకోవడానికి ఇస్లాం మతంలో ఉన్న 'మాల్ ఎ గనీమత్' అనే అంశాన్ని స్వీకరించి, తన పరిపాలనలో ప్రవేశపెట్టాడు. 'మాల్ ఎ గనీమత్' అంటే దాడిలో / యుద్ధంలో దొరికిన సంపదలో సైనికులకు వాటాలివ్వడం. అలా ఇవ్వడం వల్ల సైనికులు అత్యుత్సాహం ప్రదర్శించి ఎక్కువ సంపదను కొల్లగొట్టుకొస్తారని ఆశ. ముస్లిం రాజులు అనుసరించిన అంశాన్ని స్వీకరించడమే కాదు, ఇంకా మరో నాలుగడుగులు ముందుకు పోయి దోపిడీదార్లను,

గూండాలను, వ్యభిచారులను కూడా తన సైన్యంలో భాగస్వాములను చేశాడు. గుళ్ళలో దేవదాసీ వ్యవస్థను, బసివి వ్యవస్థను, జోగిని వ్యవస్థను మతం పేరిట ప్రవేశపెట్టాడు. అంటే మతం ముసుగులో స్త్రీల జీవితాన్ని దుర్భరం చేశాడన్నమాట. తన రాజ్య కాంక్షకు, రాజకీయ సిద్ధాంతానికి మతం రంగు పులిమి జనాన్ని కట్టిపడేశాడు.

ఇది ఇలా ఉంటే 'వీర వైష్ణవం' కూడా ఏమీ తక్కువ తినలేదు. 'వీరశైవాని'కి ధీటుగా పనిచేసింది. గుళ్ళలో 'దేవదాసి' వ్యవస్థను ప్రవేశపెట్టి, వారికి 'కృష్ణ-మురళి' అనే పేర్లతో పేద కులాల స్త్రీలను వ్యభిచారంలోకి లాగారు. దుర్మార్గంగా కొనసాగించారు. ఈ వ్యవస్థలు శతాబ్దాలుగా కొనసాగుతూ రావడం కూడా మనం గమనిస్తూనే ఉన్నాం. ఇలా గుళ్ళను ఆర్థిక వనరులుగా సమాచార కేంద్రాలుగా, వ్యభిచార కేంద్రాలుగా మార్చుకున్న అగ్రవర్ణాలు వీరశైవం, వీర వైష్ణవం పేర్లతో సమాజాన్ని తమ గుప్పిట్లో పెట్టుకున్నారు. ప్రజలకు కావలసిన విద్య, వైద్యం పట్ల వీరు శ్రద్ధ పెట్టలేదు. కేవలం వారి మత ప్రచారానికి కావలసిన కళల్ని - ముఖ్యంగా సాహిత్యాన్ని, సంగీతాన్ని, నృత్యాన్ని మాత్రమే ప్రోత్సహించారు. ఆలయాల ద్వారా వచ్చిన ఆదాయం ప్రజల కోసం ఎప్పుడూ ఖర్చు చేయలేదు. మళ్ళీ ఆ డబ్బు మత ప్రచారానికే ఉపయోగించారు. ఒక్కోసారి పూజారి వర్గం భోగభాగ్యాలకు, అక్రమ లైంగిక సంబంధాలకు ఉపయోగించు కున్నారు. ఆలయాల ఆదాయం ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలకు ఉపయోగిస్తే... ఆలయాల నేల మాళిగల్లో గుప్తనిధులు పేరుకుపోయేవి కాదు.

ప్రేమ, కరుణ, శాంతియుత సహజీవనం గురించి ఈ దేశంలో మొదటిసారి మాట్లాడింది బౌద్ధులు, జైనులు. ద్వేషాన్ని విడనాడాలని, నిర్మలమైన మనసుతో, సహనంతో, సానుభూతితో జీవనం సాగించాలని చెప్పినవి ఈ మతాలే. రాజ్యకాంక్షకు, రాజకీయ కుతంత్రాలకు ఇవి అడ్డుపడేవిగా ఉన్నాయని కొంతమంది రాజులు, అగ్రవర్ణ మనువాదులూ మండిపడ్డారు. జైనుల్ని, బౌద్ధుల్ని చిత్రహింసలు పెట్టారు. వారి విహారాలను, ఆరామాలను కొల్లగొట్టి శివాలయాలుగా, వైష్ణవాలయాలుగా మార్చేశారు. బౌద్ధం, జైనం యుద్ధానికి వ్యతిరేకం కాబట్టి వాటిని అణచిపెట్టడానికి వీరశైవం, వీరవైష్ణవం ఉద్యమాలకు ఊపిర్లూదారు. లోతుగా ఆలోచిస్తే మత దౌర్జన్యాలు, మతదాడులు, మత యుద్ధాలు ఏవీ మతం కోసం కాదు. అంతిమంగా అధికారం సాధించడం కోసమేనని అర్థమవుతూ ఉంది. మతవ్యాప్తి పరమావధి కాదు. అధికారమే పరమావధి. మతాన్ని ఒక మెట్టుగా, ఒక నిచ్చెనగా ఉపయోగించుకుని గద్దెనెక్కడం గతంలో ఉంది. ప్రస్తుతంలోనూ కనిపిస్తోంది. జనాన్ని వివశులుగా చేసే మతం, జనాన్ని మౌఢ్యంలోకి తోసే మతం, ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో ఇంకా అవసరమా? ప్రాణం లేకపోతే మనిషి బతకడు. కులం లేకపోతేనో, వర్గం, వర్ణం, ప్రాంతీయత లేకపోతేనో మనిషి బతుకుతాడా? బతకడా? మనిషి ప్రాణంతో ఉండడానికి ఇవి ఎంత అవసరం? వైజ్ఞానికంగా ఇంత అభివృద్ధి సాధించిన తర్వాత కూడా ఆలోచించుకోకపోతే ఎలా ?

ఇతర మతాల కంటే భిన్నంగా బౌద్ధం విద్య మీద దృష్టి పెట్టింది. నలందా లాంటి ఆనాటి విశ్వవిద్యాలయాలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయని మనకు తెలుసు. దేశం బ్రిటీషు పాలనలో ఉండగా క్రిస్టియన్ మిషన్ స్కూల్సు, క్రిస్టియన్ మిషన్ హాస్పిటల్స్ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున వెలిశాయి. అవి విద్య, వైద్యం పాటు మత ప్రచారం కూడా చేశాయి. పెద్దఎత్తున మత మార్పిడులను ప్రోత్సహించాయి. తమ ప్రాభవం, తమ అధికారం సుస్థిరంగా ఉంచుకోవడం కోసమే. బ్రిటీషు పాలకులు నాణాల మీద శ్రీరామచంద్రుని పట్టాభిషేకం ముద్రించారు. ఎందుకూ? ఈ దేశంలో హిందువుల జనాభా ఎక్కువ గనక, వారి ఆరాధ్య దైవం రాముడు గనక, ఆ రామ పట్టాభిషేకంతో తమని తాము గుర్తించుకుంటారు గనక... ఆ విధంగా జనం మన్ననలు పొందడానికి నాటి బ్రిటీషు ప్రభుత్వం ఆ పని చేసింది. బ్రిటీషు వారికి రాముడు దేవుడు కాకపోయినా, రాముడి పట్ల వారికి భక్తి భావం లేకపోయినా ప్రజల మన్నన పొందడానికి వారి మతాన్ని, దేవుణ్ణి ఉపయోగించుకున్నారన్నమాట. అదే ఆలోచనా విధానాన్ని నేటి మన పాలకులు కూడా పాటిస్తున్నారు. జనాన్ని ఆకట్టుకోవడానికి లేదా వారి విశ్వాసాన్ని పొందడానికి చివరికి వారి ఓట్లు రాబట్టడానికి జనం నమ్మకాలతో మమేకమైపోతుంటారు. బోనాలెత్తుకుంటూ ఉంటారు. పుష్కర స్నానాల పేరుతో మురికిలో మునుగుతారు. స్వాములూ బాబాల కాళ్ళ మీద పడతారు. జనబాహుళ్యంలో ఉన్న మూఢనమ్మకాల్ని పెంచి పోషిస్తారు. జనం వివేకవంతులై, అలాంటి వారిని ఎన్నికల్లో గెలిపించకుండా ఉంటే సమాజం బాగుపడుతుంది.

ఒక్క విషయం ఒప్పుకుని తీరాలి. ఈ దేశంలో మతకలహాలు లోగడ జరిగాయి. ఇప్పుడూ జరుగుతున్నాయి. అయితే అవన్నీ మతం పేరుతో ఆధిపత్యం కోసం, అధికారం కోసం జరిగిన పోరాటాలే గాని వాటిలో ఏవీ కేవలం మతం కోసం జరిగినవి కాదు. మతాన్ని ఉపయోగించుకున్నవి మాత్రమే.

☞ మిగతా 31వ పేజీలో

# ఏ కలుగులకీ ప్రస్థానం ??



మందలపర్తి కిషోర్

మన సమాజంలో స్త్రీలకు రక్షణ కొరవడం హఠాత్తుగా నవంబర్ చివరివారంలోనే మొదలైన కొత్త ధోరణేం కాదు. అకాశంలో సగం, పాతాళంలో ముప్పాతిక అంటూ రియల్ ఎస్టేట్ ప్రమోటర్స్ భాషలో అపారమయిన హృదయ వైశాల్యం ప్రదర్శించడంలో ఒకరితో ఒకరు పోటీ పడే మన రాజకీయ దుశ్శాసనులు, స్త్రీల విషయానికి వచ్చే సరికి పరమ పైశాచికంగా ప్రవర్తించడం లోకులెరిగిన నిజం.

ఇలాంటి దారుణాలకు ఒడిగట్టి ముద్దాయిలుగా నమోదయిన ఎందరో నేతలు– చట్టసభలను ఆక్రమించి మన పాలిట విధాతలై పౌరుల తలరాతలు నిత్యం రాస్తున్నారు. ప్రత్యేకించి, వివిధ రాష్ట్రాల్లో అధికార పక్షాలుగా ఉన్న పార్టీలకే ఈ 'మగానుభావు'ల్లో అత్యధికులు ప్రాతినిధ్యం వహిస్తూండటం చూస్తే, అధికారానికీ, ఈ తరహా పైశాచికత్వానికీ ఏదో సంబంధం ఉందేమో అనే అనుమానం రావడం సహజం!

చతుష్పాద పశువుగా ఉండిన వానరం, రెండు చేతులూ – రెండు కాళ్లతో చరించే మనిషిగా మారడాన్ని సుదీర్ఘ పరిణామ క్రమంగా చెప్తారు. ప్రకృతిలో దొరికే కాయా కసరూ తిని బతికే వానరుడి కన్నా తన కోసం తాను షడ్రసోపేతమయిన భోజనాన్ని తయారు చేసుకోగలిగిన నాగరిక నరుడు గొప్పవాడనే అభిప్రాయం మనకు చిన్నప్పట్నుంచీ నూరిపోస్తారు. వేటగాళ్లూ, ఆహార సేకర్తలూ పరిసరాల విషయంలో ఎంతో శ్రద్ధతో వ్యవహరించే వాస్తవానికి పెద్దగా ప్రాముఖ్యం ఇవ్వకుండా, ఉత్పత్తి పేరిట ప్రకృతినీ, సాటి మానవుల్నీ కూడా తుంగలో తొక్కిపారేసే క్రూరత్వానికి 'అభివృద్ధి' అనే లేబిల్ తగిలించి మన నెత్తిన రుద్దుతుంటారు. కానీ చతుష్పాద పశువుగా ఉండిన వానరం ఏనాడూ ఆడకోతులను చెరిచినట్లు ఎక్కడా ఎవ్వరూ చెప్పలేదు. ద్విపాద పశువయిన మనిషికి మాత్రమే ఈ పైశాచికత సంక్రమించింది.

అంతకుమించి, స్త్రీల పట్ల అనాగరికంగా ప్రవర్తించే పోకిరీ'జులాయి' 'లోఫర్' 'రోగ్' 'ఇడియట్' 'దేశముదురు' తదితర గుణనిధులనే గొప్ప హీరోలుగా ప్రదర్శించే కుసంస్కారం కోట్లను అర్జించి పెడుతోంది. ఈ లక్షణాలను వినోదంగా ఆడపిల్లలకు సైతం చూపించే సమాజం, వాటిని ఎన్నడైనా ప్రశ్నించగలదా?

వేల సంవత్సరాల పాటు సాగిన మానవ సమాజ పరిణామ క్రమంలో మనిషి ఏ వెలుగుల్లోకి ప్రస్థానించ బోయి – ఏ కలుగుల్లోకి పతనమయ్యాడో ఒక్క క్షణం నిలబడి ఆలోచించుకోవలసిన తరుణం వచ్చిపడిందిప్పుడు. తాజాగా 'దిశ దారుణం' మరో సారి ఈ చర్చను మన ముందుకు తీసుకువచ్చినా, మనిషినీ – మానవ సమాజాన్నీ ప్రకృతిలో భాగంగా పరిగణించే చింతకులు ఈ అంశాల గురించి వేలాది సంవత్సరాలుగా ప్రస్తావిస్తూనే వున్నారు. ఈ చింతకుల బోధనల సారాంశం ఒక్కటే! స్త్రీల పట్ల క్రూరత్వం, కేవలం వారికే పరిమితమయింది కాదు. పెట్టుబడి చుట్టూ పరిభ్రమించే విలువల వ్యవస్థలో ఈ లక్షణం ఒక అంశ మాత్రమే! ఆర్థిక స్తోమత విషయంలో బలహీనులు – ఇకపై డబ్బు సంపాదించజాలని వృద్ధులు – చదువులూ పెళ్లిళ్లూ పేరంటాల పేరిట ఖర్చులకు కారకులయ్యే పిల్లలు – ముఖ్యంగా ఆడ పిల్లల విషయంలో ఈ మాగానుభావులు నిర్లక్ష్యం, నిర్లిప్తత, నిరసన, క్రూరత్వం ప్రదర్శించడానికి సైతం ఆ విలువల వ్యవస్థే కారణం.

సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుభాషణ్ రెడ్డి లాంటి పెద్దలు కొందరు తప్ప, మంద మనస్థత్వంలో అనందమరందం అస్వాదించే అల్పజీవుల్లో అత్యధికులు 'దిశ దురంతం' పర్యవసానంగా జరిగిన 'ఎన్‌కౌంటర్' సంఘటనను విమర్శనాత్మకంగా విశ్లేషించుకోలేకపోయారు. సమూహాలు నాగరిక సమాజాలుగా పరిణమించే దశలో ఇలాంటి లక్షణాలను విసర్జించి, బాధ్యతలతో కూడిన ప్రవర్తన అలవర్చుకుంటాయి. మంద మనస్తత్వంలో వ్యక్తమయ్యే 'సామాజిక, జాతిపరమయిన చైతన్య రాహిత్యం' స్థానంలో, 'పరిణితితో కూడిన సంస్కారం' సామాజిక చైతన్యజాలంలో ప్రధాన పాత్ర వహిస్తూ పోతుంది. మన సమాజం ఆ దశకు చేరుకోడానికి అనేక మన్వంతరాలు పడుతుందేమో అనే బెంగను కలిగిస్తున్నాయి షాద్‌నగర్ పరిణామాలు. 'ఎన్‌కౌంటర్' లాంటి దుష్పరిణామాలు ఒక వంకా, దిశ దుర్ఘటన మరో వంకా అదే విషయాన్ని సూచించడం కన్నా విషాదం మరేముంటుంది?

☞ మిగతా 25వ పేజీలో

# రాజ్యాధికారం

## భావ సమాలోచన

శ్రామికులు, దళితులు, బహుజనులు, మైనారిటీలు రాజ్యాధికారంలో తగిన పాత్రను పోషించలేక పోతున్నారు. బహుజనులు, దళితులు తమకు రాజ్యాధికారం దక్కాలన్న ఆకాంక్షను పదే పదే వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికలలో అలాంటి ప్రయత్నాలు ఒకటి రెండు సార్లు జరిగినా అవి ఫలితాలను ఇవ్వలేదు.

ప్రస్తుత పరిస్థితి ఏదో ఒక పార్టీకి ఓటు బ్యాంకులుగానే మనుగడ సాగిస్తున్నారు. మన ఎన్నికల వ్యవస్థ కుబేరుల సొత్తు అయింది. మరో పక్క హిందూత్వ జాతీయవాదం ముసురు కొస్తున్నది. డా అంబేద్కర్ సారధ్యంలో అందరికీ సమాన హక్కులు కల్పించిన ప్రజాస్వామ్య రాజ్యాంగం ప్రమాదంలో పడుతున్నది. డా అంబేద్కర్ ఒకనాడు దహనం చేసిన మనువాదం ఇప్పుడు పాలనకు తహ తహ లాడుతున్నది.

ఈ నేపథ్యంలో సకల శ్రామికులకు, దళితులకు, బహుజనులకు, మైనారిటీలకు రాజ్యాధికారం అన్నది తప్పనిసరి చర్చనీయాంశం అవుతున్నది. ఈ తరగతుల ప్రజలు అత్యధిక సంఖ్యాకులైనప్పటికీ వీరిమధ్య రాజకీయ ఐక్యత ప్రస్నార్థకంగానే వుంటున్నది. కేవలం నినాదంతోనే ఈ తరగతుల ప్రజల మధ్య రాజకీయ ఐక్యత సిద్ధించదు. అంతకు ముందు ఈ తరగతుల మధ్య సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాలలో ఒక ఉమ్మడి దృక్పధం పాదుకొనాలి. దానికి తగిన చైతన్యాన్ని కలిగించే భావ విప్లవం ఈ తరగతుల ప్రజలను ఆవహించాలి. ఈ పునాది మీదే అది రాజకీయ ఉద్యమంగా విజయాలను సాధిస్తుంది.

అలాంటి ఉమ్మడి చైతన్యాన్ని, ఉమ్మడి దృక్పధాన్ని కల్పించడానికి ఈ తరగతుల ఆవేదనలనూ, ఆకాంక్షలను వ్యక్తం చేస్తున్న మేధావులు, రచయితలు కవులు, కళాకారులు, ఉద్యమ కారులు అందరికీ ఒక ఉమ్మడి వేదిక అవసరం. ఇలాంటి ఉమ్మడి భావ విప్లవానికి దోహదం చేసే విధంగా జాతీయ స్ఫూర్తి అభిప్రాయ వేదికను నిర్వహిస్తున్నది. ఈ అభిప్రాయం వేదికను వినియోగించుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

మీ అభిప్రాయాలను, రచనలను ఈ కింది ఈ మెయిల్‌కు పంపండి. dvvsvarma1946@gmail.com ❑

# వర్గ సమన్వయంతోనే దళిత-బహుజనులకు రాజ్యాధికారం..

కదిరి కృష్ణ
బహుజనబంధు

భారత దేశంలో గ్రామ నిర్మాణంలో, నాగరికత కట్టడంలో దళిత, బహుజన కులాల పాత్ర అనిర్వచనీయం. వ్యవసాయిక దేశమైన భారత్లో ఈ కులాలు లేకుండా మనుగడ సాగించడం కష్టం. నీళ్లు తోడే తొండం, బొక్కెనలు సమకూర్చి తోలు సంస్కృతికి మాదిగలు ఆద్యులైతే, కమ్మరుల నాగలి, సాలెల ప్రస్తాలు, కుమ్మరుల కుండలు, వడ్డెరల గృహనిర్మాణ సాధనాలు, గొల్లకుర్మల పాడి దేశాన్ని పరిపూర్ణంగా తీర్చిదిద్దినవి. జనాభా రీత్యా చూసుకున్నా నూటికి ఎనభై శాతం దళిత, బహుజన కులాలే. ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థల్లో గమనిస్తే ఈ కులాలు ఉత్పత్తి శక్తులుగా ఉన్నప్పటికీ, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు వీరిని పాలక వర్గాలు దూరం చేస్తున్నాయి. ఓటు బ్యాంకు దృష్ట్యా ఎనభై శాతం ఉండే బహుజనులు, మైనార్టీలైన రాజకీయాధిపత్య కులాల ఏలుబడిలో మగ్గుతున్నారు. దేశ రాజకీయాధికారాన్ని నిర్ణయించేది ఖచ్చితంగా దళిత, బహుజన కులాలే ఐనప్పటికీ, రాజకీయ పెత్తందారీ కులాల చేతిలో నిర్వీర్యశక్తులుగా మారుతున్నారు. గతంలో దళితులను నిర్ణాయక ఓటు బ్యాంకుగా భావించినప్పటికీ, ఇటీవల చీలిపోయి ఉండడంతో అమ్ముడు పోయే వ్యక్తులుగా మిగిలిపోయిన పరిస్థితి నెలకొని ఉన్నది. పైగా బహుజనులు– దళితులు తమలో తాము కుల వైషమ్యాలతో కలహించుకుంటున్న సంఘటనలు ఈ దూరాన్ని మరింత పెంచిపోషిస్తున్నాయి. బహుజనులను–దళితులు, దళితులను–బహుజనులు శత్రువులుగా భావించు కుంటున్న దాఖలాలూ ఉన్నాయి. ఇలాంటి విపరీత పరిస్థితుల నేపథ్యంలో రాజ్యాధికారం ఎలా సాధ్యం? ఏ కులానికి ఆ కులం స్వంత అస్తిత్వాలు కలిగి ఉంటే తప్పు లేదు. మరో బాధిత కులాన్ని ద్వేషిస్తూ, హెచ్చుతగ్గులు పెచ్చరిల్లుతున్న తరుణంలో దళిత,

గిరిజన, బహుజన రాజ్యాధికార నినాదం నీటిమీద రాతలాంటిదే అవుతుంది.

బహుజన పితామహులు పూలే, పెరియార్, డా॥ అంబేద్కర్ల దృష్టిలో రాజ్యాధికారం ఎలా సాధించాలి? ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వ్యూహ ప్రతివ్యూహాలు, ఎత్తుగడలు రాజ్యాధికారానికి మార్గాన్ని సులభ గ్రాహ్యం చేయగలవు? కేవలం మాదిగలు, కేవలం మాలలు అలాగే యాదవ, గౌడ, కాపు, చాకలి, మంగలి కులాలుగా వైయుక్తికంగా రాజ్యాధికారం సాధించగలవా? పోనీ బహుజనులు దళితులు వేర్వేరుగా రాజ్యాన్ని కైవసం చేసుకోగలరా? రాజ్యాధికార సాధనలో ఈ అణగారిన కులాల్లోని విద్యార్థి, మేధావి, ఉద్యోగుల కర్తవ్యం ఎంత? ఇలాంటి ప్రశ్నలెన్నో బహుజన ప్రజల్ని, కార్యకర్తల్ని వేధిస్తున్నాయి. అయితే ఇవేమీ సమాధానం లేని ప్రశ్నలు కావు. పైగా ఈ ప్రశ్నలకు సూటిగా సమాధానాల్ని ఇవ్వగలిగినప్పుడే బహుజన రాజ్యాధికార సిద్ధాంతాల్లో నెలకొన్న గందరగోళం నశిస్తుంది. ఇందుకుగాను మొదట దళిత-బహుజనుల్లోని వైరుధ్యాల సమన్వయం సాధించడం అవసరం. ఇక ప్రధాన సమస్య- దళితులు నాయకత్వం వహించాలా, లేక బహుజనులు నాయకత్వం వహించాలా? రాజ్యాధికారంలో పరస్పర అవసరం ఎంత? ఆంధ్రసీమ ఐనా, తెలంగాణ రాష్ట్రమైనా ఎస్సీల జనాభా 18 నుండి 22 శాతం వరకు ఉంటుంది. బహుజనుల జనాభా 50 శాతానికి తక్కువ ఎక్కడా లేదు. కాబట్టి దళిత-బహుజలు కలిస్తే 70-75 శాతం జనాభా ఉన్నారు. అలాంటప్పుడు రాజకీయంగా స్వతంత్రంగా రాజ్యాధికారం సాధ్యమే. 1935లో భారత ప్రభుత్వ చట్ట రూపకల్పన సందర్భంలో, 1950లో భారత రాజ్యాంగ పరిషత్ ఎన్నికల విషయంలో బహుజనుల అనైక్యత వల్లే రాజకీయ బానిసలుగా మారిపోయారు. 66 సంవత్సరాలు గడిచినా చట్ట సభల్లో బహుజనుల ప్రాతినిధ్యం అందని ద్రాక్ష చందంగా మారింది.

డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు, రెండు జాతుల మధ్య సంఘర్షణ ఒక జాతికి విజయాన్ని ఇస్తుంది. ఒకే జాతిలో సంఘర్షణ ఆ జాతిని తుదముట్టిస్తుంది. ఒక జాతి కుల అస్తిత్వాన్ని ఇంకో కులం గౌరవించి అమోదించగలిగితే అసలు సమస్యే ఉండదు. కులాల వారీగా విద్వేషాలు సృష్టించుకోవడం, విడిపోవడం ఉద్యోగులు, విద్యావేత్తల్లోనే ఎక్కువగా ఉన్నది. విపరీతంగా పెరిగిపోయి అగ్రకులాలకు మద్దతుగా నిలవడానికి పోటీపడుతున్నారు. ఇది దురదృష్టకర పరిణామం. స్వయంగౌరవం లేని జాతులు బానిసలుగా మారుతాయని చరిత్రకారుల భాష్యం నిజమే. ఆత్మగౌరవం కోల్పోవడం వల్లే బహుజనులు బానిసత్వానికే మొగ్గుచూపుతున్నారు. పెరియార్ ఈ దృష్ట్యా తన ఉద్యమానికి 'స్వయం గౌరవ ఉద్యమం' గా పేరు పెట్టారు. స్వయం గౌరవం ఉన్న ప్రజలు మానవహక్కుల గురించి ఆలోచిస్తారు. పెత్తందారుల, అగ్రకులాల ఆధిపత్యంపై తిరగబడతారు. పెరియార్ ఇదే దృక్పథం కులనిర్మూలనకు దోహదకారి కాగలదని భావించాడు. పూలే తన ప్రతిబోధనలోనూ అణగారిన వర్గాల ప్రజల్లో ఆత్మనూన్యతా భావాన్ని పోగొట్టేందుకే ప్రయత్నించాడు. అందులో భాగంగానే బలిచక్రవర్తిని చరిత్రల్లోంచి వెలికి తీశాడు. బ్రాహ్మణ కులాల దాడుల చరిత్రను అవలోకించి స్పష్టమైన దృక్పథాన్ని అందించాడు. సామాజిక, చారిత్రక రంగాల్లోని గజి బిజిని ఛేధించి బహుజన దృష్టి కోణాల్లో మొత్తం వ్యవస్థను నిర్వచించాడు. ఇదే బహుజన దృక్పథాన్ని హైదరాబాద్ సంస్థానంలో భాగ్యరెడ్డివర్మ, మద్రాస్ ప్రెసిడెన్సిలోని ఆంధ్రప్రాంతంలో త్రిపురనేని రామస్వామి ప్రచారంచేశారు.

చివరగా స్వతంత్ర నాయకత్వాన్ని బహుజన రాజకీయ సైద్ధాంతిక పునాదుల వెలుగులో నిర్మించుకోగలిగి నప్పుడు రాజ్యాధికారం వస్తుంది. డా? బాబాసాహెబ్ అంబేద్కర్ అన్నట్లు సాంస్కృతిక విప్లవం రాజకీయ విప్లవానికి, రాజకీయ విప్లవం సామాజిక, ఆర్థిక విప్లవానికి దారితీసి సమ సమాజం నెలకొనాలి. అప్పుడే ఈ బానిస కులాలకు విముక్తి.. ❑


## జాతీయ స్ఫూర్తి

### రిపబ్లిక్‌డే ప్రత్యేక సంచిక

**భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా**
**భారత రాజ్యాంగంపై ప్రత్యేక వ్యాసాలతో**
**'రిపబ్లిక్ డే ప్రత్యేక సంచిక'గా**
**జాతీయ స్ఫూర్తి పత్రిక**
**జనవరి నెల సంచికలను వెలువరిస్తున్నాం.**
**ప్రత్యేక సంచికలో ప్రచురణార్థం వ్యాసాలు**
**పంపేవారు జనవరి 15వ తేదీ లోగా పంపగలరు.**

**పంపవలసిన చిరునామా :**

**డి.వి.వి.యస్. వర్మ**
**ప్రధాన సంపాదకులు, జాతీయ స్ఫూర్తి**
బొమ్మలవీధి, **తణుకు - 534 211**
**✆ 98660 74023, 85006 78977**
**email : dvvsvarma1946@gmail.com**

# కలవడమెలా?



హెచ్చార్కే
'రస్తా' పత్రిక సంపాదకులు

రాజ్యాధికారం
భావ సమాలోచన

మొహమాటాలొదిలి మాట్లాడుకుందామా?

పోయినోళ్ళందరూ పోయాక, పోకుండా మిగిలినోళ్లమైనా ...

మాట్లాడితే అన్య ధోరణి అని ముద్ర వేస్తారని భయపడకుండా మాట్లాడుకుందామా?

మాట్లాడుకోవాల్సిందే గాని, ఇప్పుడు కాదు, ఇప్పుడు మనం కష్టాల్లో వున్నాం.. అంటారా?

మనం కష్టాల్లో లేనిదెప్పుడు? ఎన్నుకున్న జీవితంలో కష్టాలు అవినాభావం.

కష్టాల్లో వుండకపోతే జనం మనల్ని గుర్తించరని సందేహం కూడా.

ఏ ప్రజా పోరాటాలు చేయడం వల్ల ప్రత్యేకించి ఇప్పుడు కష్టాల్లో వున్నామో కాస్త చెబుతారా, ఎవరేనా?

'వునికి' నిరూపణ కోసం మనల్ని నమ్మిన వాళ్ళను కష్టాల్లోకి ఎందుకు తీసుకెళ్తున్నామో ఒక సారి చూసుకుందామా?

* * *

ముక్కలు ముక్కలయిపోయాం.

ఎవరి ముక్క మీద వాళ్ళం కూర్చుని ఇదే విముక్తి అంటున్నాం.

ఇప్పుడు కాకుంటే రేపైనా ఇదే... ఇదొక్కటే విముక్తి, మరో మాట లేదంటున్నాం.

మనకు మనమే... వున్న స్థలానికి జిగురు రాసుకుని అతుక్కు పోతున్నాం. జనాల్ని మనం వున్న స్థలానికి అతికించి వుంచడానికి తంటాలు పడుతున్నాం.

మన లాంటి వాళ్ళే మరి కొందరు. ఎవరి ఘెట్టో వాళ్ళది. పేర్లు వేరంతే.

నువ్వు తప్పంటే నువ్వు తప్పని.. ఒకర్ని ఒకరం అనుకోడం కేవలం ఒక ఆట.

అదేమంత సీరియస్ విభేదం కాదు. అందుకే, సీరియస్ చర్చ కూడా వుండదు.

అప్పుడప్పుడు, నీ పని నువ్వు చేసుకో, నా పని నేను చేసుకుంటానని 'పాజిటివిజా'లు ఒలకబోస్తుంటాం. సహకరించుకుంటాం, ఒకరి సెక్టేరియనిజానికి ఒకరం.

అప్పుడప్పుడు, మనకు వాళ్ళు, వాళ్ళకు మనం పూల దండలేసి సమరస భావ గీతాలేవో పాడుకుంటాం.

మనకు మరీ కష్టం వొచ్చినప్పుడు ఎవరితో కరచాలనానికైనా, ఎవరితో స్వరచాలనానికైనా సిద్ధపడుతున్నాం.

అది ఏ ఆదివాసుల కోసమో అయితే, సరే. అక్కడ, ఒక ఇస్యూ అయినా వుంటుంది, నిజంగా ఉన్నట్లయితే, ఆదివాసులు కేవలం 'బ్యారికేడ్లు' కానట్టయితే.

* * *

ఎవ్వటికప్పుడు, అప్పటికి మిగిలిపోయిన గ్రామీణ అమాయకత్వాన్ని కొద్ది కొద్దిగా తోడి ఎవరికి తోచిన రీతిలో వాళ్ళం వాడేసుకుంటున్నాం, వేటాడే సింహాలుగానో, సింహాల పంచన చేరిన నక్కలు గానో, సింహరాజుల వేటకుక్కలుగానో. ఆ పై ప్రజలూ ప్రజలంటూ మైకు విస్ఫోటాలు.

మనం సమాజ సమస్యల పరిష్కారాలం కాము. సమస్యలం. పాలకులకే కాదు, ప్రజలకూ సమస్యలం.

ప్రజల మస్తిష్కాల మీద దయ్యపు భారాలమయ్యాం. ప్రజలు మనల్ని దాటి పోవాలి, తమను తాము కనుక్కోడానికి.

'మనం ప్రజల కోసం' అనడం నిజం కాదు. 'ప్రజలు మన కోసం'.. మన నిష్ఫల ప్రయోగాల కోసం అనేది నిజం.

ఈ నిజం తనను తాను రుజూ చేసుకుని చాల కాలమైంది.

నిజం తెలిసింది, మరిక, ఇప్పుడేమిటి?

* * *

అడవుల్లోని వాళ్లు సరే. అడివిలోకి వెళ్లినంత సులువు కాదు దాన్ని వొదిలి రావడం. కంప మీద తువ్వాలు విసిరినంత సులువు కాదు, కంప మీంచి తువ్వాలు తీసేసుకోడం.

ఎంత చిరిగిన తువ్వాలైనా తీసేసుకోడం ఒక యజ్ఞమే. వాళ్లు ఆ యజ్ఞంలోనే వున్నారనుకుందాం.

ముక్కలు ముక్కలై పోవడం, సమాజాన్ని ముక్కలు ముక్కలుగా చూడడం ఆడవుల వాళ్ల పని మాత్రమే కాదు. 'వూళ్ళ'ల్లోని వాళ్ళు ఆ తానులోని ముక్కలే.

అవే టాక్టిక్స్.

ముక్కలు ముక్కలయిపోవడం లోనే వీళ్ళకూ సుఖం. పేర్లు

'మాహానాడు'లు, 'దండోరా'లు, 'దళిత బహుజనులు'. అంతే. పేర్ల తేడా.

ఎవరో అన్నారెక్కడో... దళిత, బహుజన, తెలంగాణా వాదులందరూ ఏకం కావాలని. వెరసి ఒక్కటై బిజేపీని ఓడించాలని. భలే బాగుంది. నినాదం.

తెలంగాణ వాదుల్లో రెడ్లు, కమ్మలు, వెలమలు వుంటారు. రెడ్డి, కమ్మ, వెలమలందరూ అగ్రవర్ణులు, అందువల్ల జన్మతః బ్రాహ్మణవాదులు అనేశాం కదా?!

మరి యిప్పుడు బహుజనుల పిలుపందుకుని వాళ్ళు వొచ్చి కలిస్తే.. 'దళిత బహుజన.. శిబిరంలో వాళ్ళ స్థానాలేమిటి? ఈ శిబిరంలో తమ చోటు జన్మతః.. అనగా ఎప్పటికీ.. కేవలం అనుచరత్వమే నంటే, ఎందుకు వొస్తారు వాళ్ళు, వాళ్ళేమైనా పిచ్చోళ్ళా? కులం పేరిట మేమిన్నాళ్ళు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు చేసిన వూడిగాలు చాలు, ఇప్పుడు అదే వూడిగం దిగువ నుంచి మొదలెట్టాలా అని వాళ్ళలో వాళ్ళయినా మాట్లాడుకోరా?

ఇలా ఎవరినో వ్యతిరేకించడానికి పరిమితమయ్యే 'ఐక్యత' ఎన్నాళ్ళుంటుంది.

ఏదైనా ఒక పని చేయడానికి కలుపుకున్న ఐక్యత అయితే, ఆ పని జరిగినంత కాలమయినా వుంటుంది.

ఇప్పుడు మీరు ఉవాచించే ఐక్యత ఎలాంటిది? ఈ ఐక్యత చేసే 'పని' ఏమిటి, కేవలం ఒక వ్యతిరేకత.

* * *

మొత్తం మీద ఇప్పుడున్నది పాలకుడికి బాగుంది.

ఆదివాసుల వెనుక కొందరు, మాల మహానాడు వెనుక కొందరు, మాదిగ దండోరా వెనుక కొందరు, ముస్లిం/ఇస్లాం వాదం వెనుక ఇంకా కొందరు.. ఎవరికి వారై వుండడం బాగుంది. ముక్కలు ముక్కల రాజకీయాల మీద అధారపడిన వాళ్ళూ... ఏదో కాసేపటి కోసం.. బహుశా ఎన్నికల వరకు... ఈ ముక్కలు కలవాలనడం శుష్క నాదమని పాలకుడికి బాగా తెలుసు.

పాలకుడికి ఇది ఇట్టాగే బాగుంది.

మన వల్ల వాడికి నష్టమేమీ లేదు. పోగా బోల్డంత లాభం.

నువ్వూ, నేనూ, వాడు... ఇలా... నువ్వూ, నేనూ, వాడుగా వుండడం బాగుంటుంది పాలకుడికి.

మనం 'మనం' అయిపోకుండా విడి విడిగా, ఫ్రాగ్మెంటెడ్‌గా వుండడం బాగుంటుంది పాలకుడికి.

ఇలాగైతేనే వాడి పబ్బం గడుస్తుంది.

వాడు తనలో తాను నవ్వుకుంటున్నాడు.

మనల్నిచూసి. పెద్ద పెద్ద మాటలు చెప్పే మన కొద్ది మనస్సులను చూసి. వైశాల్యపు మాటల మన ఇరుకు మనస్సులను చూసి నవ్వుకుంటున్నాడు శత్రువు.

'మీరు బయటికి ఏదో అంటారు గాని మీకు మేము బాగా నచ్చాం, అందుకే మేము వుండగలుగుతున్నాం' అంటున్నారు డొనాల్డ్ ట్రంపులు, నరేంద్ర మోడీలు.

'మీక్కూడా మాలాగే వుండాలని వుంది. వీలు కాలేదు గాని మీకూ మాలాగే గడించాలని వుంది, గడించిన దానితో గద్దెలు తయారు చేసుకుని కూర్చోవాలని వుంది'.

'ఎందుకో, ఏ పొరపాటున్నో, ఏ బలహీనతల వల్లనో, అప్పటి ఏ ప్రలోభాల వల్లనో అటువేపు వెళ్ళారు, ఎప్పుడు ఫెన్సింగు దూకేసి ఇటు వద్దామా అని చూస్తున్నారంతే' అంటారు ట్రంపులు మోడీలు మనల్ని చూసి.

అందుకు సందేహమేల అన్నట్టు ఫెన్సింగ్ దూకేసి పాలక శిబిరాల్లో చేరిపోయిన నిరుటి 'మనోళ్ల'ను చూడరాదూ?!

వాళ్ళే కదా ఇప్పుడు మన హీరోలు?

'టాక్టిక్స్'.

మనలో కొందరికి నిజమైన 'పని' లేదు. తమ ఉనికికి అర్థం లేదు. తాము మునుపట్లాగే వీరోచితంగా కనిపించాలి. అలా వుండకపోయినా ఫర్లేదు, కనిపించాలంతే, బై హుక్ ఆర్ క్రుక్.

ఇలా డ్లు పూండ్లు గడుస్తాయి. ఇంఖా వందలు, వేల వ్యర్థ బలిదానాలు.

పాలకుడికి ఇది బాగుందని మనకు అర్థమవుతోందా?

జనం మీద... ఆదివాసి జనం మీదా, పల్లెటూరి జనాల మీదా... హింస కోసం... వాడికి వున్న పలు సాకులలో మనమూ ఒక సాకు కావడం వాడికి బాగుందని మనకు అర్థమవుతోందా? అసలు మనం వాడి షడ్యంత్రంలో ఒక పాచిక అయ్యామేమోనని అనిపించడం లేదా?

అనిపించదు. అర్థం కాదు. అర్థమయితే, ఇప్పటి మన పేరు ప్రతిష్టలు మనకు వుండవని భయం. అందుకే, ఇది మనకు అర్థం కాదు. కీర్తి కాంక్షను బేఖాతరు చేస్తే అర్థమవుతుంది.

* * *

నేను ఫలానా వర్గం అని చెప్పుకుంటే నీకు ఆ వర్గం రాదు.

నేను ఈ వర్గంలో పుట్టాను అని కుల ధ్రువీకరణ పత్రం తెచ్చుకుంటే, వుద్యోగం రావొచ్చు కాని, ఆ వర్గం రాదు.

దళిత కలెక్టరు కొడుకు శ్రామిక 'వర్గం' అయ్యుండాలని గ్యారంటీ లేదు.

ఎవరైనా సరే ఒక వర్గంలో 'వుండడ'మే అతడి/ఆమె వర్గ వునికికి గుర్తు.

పని చేస్తూ వుండడమే నువ్వు పనివాడివి.. శ్రామికుడివి... అనడానికి రుజువు.

ఎప్పుడో పని చేసి వుండడం కాదు. రేపు పని చేయబోవడమూ కాదు. పని చేసిన వాళ్ళకు పుట్టి వుండడం కూడా కాదు. పని చేస్తూ వుండడమే పనివాడివిగా ఉనికి/గుర్తింపు.

నిజమైన 'ఉనికి' ఒక్కటే ప్రాతిపదిక జనం కలవడానికి.

ఈ కలయికలో కలవనిది ఇక పెట్టుబడిదారులు మాత్రమే.

ఒక పని... ఒక వుత్పత్తి లేదా సర్వీస్... ఎలా జరగాలో ఆ పని చేస్తున్న పనివాళ్ళే వుమ్మడిగా నిర్ణయించాలి.

ఆ పనిలో కార్మికులెవరు, స్కిల్డ్ వర్కర్లు ఎవరు, మేనేజర్లు ఎవరు అనే నియామకాల్ని కూడా పని చేసే వాళ్ళే నిర్ణయించాలి. అన్నీ పనులే. అందరూ పనివాళ్ళే. అన్ స్కిల్డ్ నుంచి స్కిల్డ్ వర్కర్లు, మేనేజర్ల వరకు ఎవరు లేకపోయినా 'పని' నడవదు. పని చేసి జీతం తీసుకునే అందరూ కార్మికులే. వాళ్ళే నిర్ణయించాలి.. తమ శ్రమ ఫలాన్ని ఎలా పంచుకోవాలో. కార్మికులను మేనేజర్లు నియమించడం కాదు. కార్మికులే సంఘంలో చర్చించి ప్రజాతంత్రయితంగా మేనేజర్లను నియమించాలి.

అలాంటి లోకం సాధ్యమే.

ముందుగా మనల్ని మనం పనివాళ్లుగా గుర్తించుకుందాం. ఇప్పుడు ఇది రాస్తున్న, దీన్ని రాయడానికి మథన పడుతున్న నేను కూడా ఒక పని వాడినే. మా 'రస్తా' కమిటీ నిర్ణయిస్తుంది మేం ముగ్గురం ఎవరెవరం ఏం చేయాలో, ఎలా చేయాలో.

పనివాళ్ళుగా గుర్తింపే అన్ని గుర్తింపులకు కేంద్రబిందువు కావాలి.

అందరం పని వాళ్ళమే అయినప్పుడు, పని చేయడంలో, పనులను నేర్చుకోడంలో, పని ఫలాన్నీ పంచుకోవడంలో, అదనపు విలువ ఎలా ఖర్చవాలో నిర్ణయించడంలో.. అందరం భాగస్వాములే అయినప్పుడు మనమెందుకు విడిపోతామిక? వై ది ఫ్రాగ్మెంటేషన్?

నాది రాయలసీమ అయినా నీది కోస్తాంధ్ర అయినా తేడా ఏముంది నాకూ నీకూ మధ్య. ఇద్దరం పని వాళ్ళం కాదూ, పనివాళ్ళుగా వుండడం గొప్ప అనుకునే వాళ్ళం కాదూ?!

మనం ఎవరం ఏ కులంలో పుట్టి పెరిగినా పని వాళ్ళమయి వుండడమే మన వునికికి మొదటి గుర్తింపయితే, అది కాదూ మన మధ్య కృత్రిమ తేడాలు ఆవిరై పోవడానికి.

అది జరిగే వరకు ఇప్పటి ఫ్రాగ్మెంటేషన్‌కి ఢోకా లేదు. ముక్కలు ముక్కలుగానే వుంటాయి, ఇంత బాధాకరంగానే వుంటాయి.

అది జరిగే వరకు, ఈలోగా వ్యక్తులుగా ఎవరి సంగతి వాళ్ళు చూసుకోవలసిందే. ఏ నినాదాన్నయినా అది 'నాకు' పనికొచ్చేదేనా అని ప్రతి ఒక్కరం తరచి చూసుకోవలసిందే.

పని ఎలా జరగాలో కార్మికులే నిర్ణయించే కో ఆపరేటివ్స్ కల ఇప్పటికే అమలు జరుగుతోంది. వాటి అనుభవాలు తీసుకుని, ఎవరి ప్రయత్నాలు వాళ్లు చెయ్యొచ్చు.

వ్యక్తివాద ప్రపంచంలో ఎలా కోపప్ కావాలో ఎవరి పోరాటం వాళ్ళం చేస్తూనే, కలిసినప్పుడంతా కలబోసుకోవాల్సిన స్వప్నమిది. ఫ్యాక్టరీ కౌన్సిళ్ళ పేరిట ఆంటోనియో గ్రాంసీ కన్న కల దాదాపు ఇదే. ❑

---

## ఏ కలుగులకీ ప్రస్థానం ?

**(20వ పేజీ తరువాయి)**

దిశ దుర్ఘటనకు పర్యవసానంగా జరిగిన అధికారిక హత్యాకాండను 'ఎదురుకాల్పుల సంఘటన'గా చిత్రించడమే 'సామూహిక, జాతిపరమయిన చైతన్య రాహిత్యం'లో భాగం. బాధితులకు సత్వరన్యాయం దక్కాలనే ప్రజాతంత్ర ఆకాంక్షకూ, నేరస్తులుగా అనుమానించిన వాళ్ల విషయంలో 'తక్షణ న్యాయం' – అంటే, నిందితుల్ని లేపిపారేయడమే / అమలు చెయ్యాలని నూరిపోసే సద్గురువుల ప్రవచనాలకూ ఎంతో తేడా వుంది. 'కంటికి కన్నూ – పంటికి పన్నూ అనుకుని ప్రతీకారం తీర్చుకుంటూ పోతే, చివరికి ఈ ప్రపంచం కళ్లు, పళ్లు లేనిదయి మిగులుతుం'దన్నాడట ఖలీల్ జిబ్రాన్. (జిబ్రాన్ ముస్లిం అనుకుని అతని మాటల్లో హేతుబద్ధతను గుర్తించ నిరాకరించే మహానుభావులు ఒక్కసారి – కనీసం – వికీపీడియా చూడవలసిందిగా ప్రార్థన!) ఏడేళ్ల కిందట, నిర్భయ పరిణామాల నేపథ్యంలో తనను వేటాడుతున్న మగపశువుల పట్ల నిర్భయ ఎలా ప్రవర్తించి వుండాల్సిందో అనుచిత సలహాలు పారేసిన అసారాం బాపూ తర్వాతి కాలంలో అత్యాచారంతో సహా అనేక నేరాలకు గానూ కారాగార వాసం సైతం అనుభవిస్తున్న సంగతి గుర్తుంచుకోవాలి. 'దిశ దురంతం' పూర్వరంగంగా, మగవాడి క్రూరత్వానికి ప్రేరణ స్త్రీల ప్రవర్తన – ముఖ్యంగా వాళ్ల వస్త్రధారణ – నుంచే వస్తోందని బోధించే ప్రవాచకులు కొందరు పుట్టుకొస్తున్నారు. తొమ్మిది నెలల పసిపాపపై అత్యాచారానికి ఏ వస్త్రధారణ కారణం, ప్రేరణం కాగలదో ఈ అవధాన్లూ, శతావధాన్లు ఆలోచించారా? ❑

# శ్రామికవర్గ వెలుగు దివ్వె ఫ్రెడరిక్ ఎంగెల్స్

బి. రామకృష్ణ
ఉపాధ్యాయులు

**ఎంగెల్స్ జన్మించి నవంబర్ 28కి రెండు వందల ఏళ్లు అవుతున్న సందర్భంలో, దోపిడివర్గ మూలాలను తెలిపి దాని నుంచి విముక్తినిచ్చే సిద్ధాంతాన్ని అందించడంలో ఎంగెల్స్ చేసిన కృషిని వివరిస్తున్నారు.**

మానవ చైతన్యం, ఆలోచనలే మానవ ఆచరణను నిర్ణయిస్తాయని చెప్పడాన్ని పూర్వపక్షం చేసి మానవ ఆచరణ, అవసరాలే ఆలోచనలను చైతన్యాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పిన అగ్రగణ్యుల్లో మార్క్స్ తో పాటు ఎంగెల్స్ ప్రముఖ వ్యక్తి. 1820 నవంబర్ 28న బార్మెన్ పట్టణం ప్రష్యా (జర్మనీ) లో జన్మించాడు. ఎంగెల్స్ తండ్రి నూలు దారాన్ని ఉత్పత్తి చేసే పరిశ్రమకు యజమాని. తన కుమారుడు పారిశ్రామికవేత్త కావాలని ఆశించాడు. తండ్రి కోరికకు విరుద్ధంగా ఎంగెల్స్ పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల పుట్టుక, ఎదుగుదల, వారి సంపద వెనుక నలిగిపోతున్న కార్మికుల జీవితాలను అధ్యయనం చేసి ప్రపంచ శ్రామిక వర్గానికి తమ జీవితాలను మార్చుకునే మహత్తరమైన సిద్ధాంత ఆయుధాలను అందించాడు.

1842లో ఇంగ్లండ్‌లోని పారిశ్రామికాభివృద్ధి దానికి పూర్వ రంగంలో ఉన్న కార్మికవర్గ స్థితిగతులపై 21 నెలల పాటు అధ్యయనం చేశాడు. కార్మిక వాడల్లో పర్యటించి, కార్మిక కుటుంబాలతో కలిసి ఆనాటి దుర్భర పరిస్థితులను స్వయంగా పరిశీలించి అధికార రికార్డులు, వార్తా పత్రికల్లోని సమాచారాన్ని విశ్లేషించి 24 ఏళ్ల వయస్సులోనే 'ఇంగ్లండులో కార్మికవర్గ స్థితిగతులు' అనే గ్రంథాన్ని 1845 లో జర్మన్ భాషలో రాశాడు. ఈ గ్రంథం అప్పటి అనేక రాజకీయ తాత్విక ఆలోచనల్లోని డొల్లతనాన్ని బయట పెట్టింది. ఇది తరువాత 1848లో వెలువడిన కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను మార్క్స్ తో పాటు కలిసి రాయడానికి పిండ రూపంలో ఉపయోగపడింది. ఇప్పుడు మనం గమనిస్తున్న ఆర్థిక మాంద్యం గురించి దాని మూలాలను ఈ గ్రంథంలో ఎంగెల్స్ 175 ఏళ్ల క్రితమే వివరించాడు. పెట్టుబడిదారులకు లాభాలు కావాలి. ఇష్టమొచ్చిన రీతిలో ఉత్పత్తి పెంచడమే కావాలి. ఆ ఉత్పత్తులను అమ్ముకోవాలి. అవి సమాజానికి అవసరమా, అనవసరమా అనేకంటే వాటి ద్వారా సొమ్ము చేసుకోవడమే కావాల్సింది. వాటిని ఉత్పత్తి చేయడానికి పెట్టుబడిదారుల మధ్య పోటీ ఉంటుంది. ఆ పోటీలో శ్రామికుల శ్రమను చవకగా కొల్లగొట్టడానికి పెట్టుబడిదారులు ఎన్నో దారుణాలకు ఒడిగడతారు. కార్మికులకు హుందా అయిన, గౌరవప్రదమైన జీవితం గురించి వారికి అవసరం లేదు. డిమాండ్ కంటే సప్లయ్ అధికమవడం, మితిమీరిన ఉత్పత్తి పోగుపడడం, మార్కెట్ సరుకులతో నిండిపోవడం, ప్రతి పదేండ్లకూ సంక్షోభాలు దాపురించడం ఈ విధంగా ఒక విష చక్రం ప్రత్యక్షమవుతుంది. ఒకవైపు ఉత్పత్తి సాధనాలు, ఉత్పాదిత వస్తువులు మితిమీరి నిల్వ ఉండిపోతాయి. మరోవైపు కార్మికులు మితిమీరి నిరుద్యోగులై జీవితావసరాలు పొందలేక పోతారని ఎంగెల్స్ వివరించాడు.

శ్రామికుల పిల్లలు, వారి విద్య, ఆరోగ్య పరిస్థితులు, జీవన ప్రమాణ స్థితిగతులు ఇంగ్లండులో ఎంత దుర్భరంగా ఉండేవో వివరిస్తూ కార్మికుల శ్రమ పునాదులపై నిలుచుని విపరీతమైన సంపదను ఆర్జించి కార్మికులను దుర్భరమైన, నికృష్టమైన పరిస్థితుల్లోకి నెట్టివేసిన తీరును, సమాజంలోని కార్మికుల శ్రమను దోచుకుంటున్న పరిశ్రమల అధిపతుల వ్యవస్థ వికృత రూపాన్ని ఎంగెల్స్ బట్టబయలు చేశాడు. సోషలిజం స్థాపించబడడమే ఈ సమస్యకు పరిష్కారమని తెలిపాడు. అప్పటికే ప్రచారంలో ఉన్న ఊహాజనిత సోషలిజం, ఇతర అపసవ్య సోషలిస్టు భావనలను ఖండిస్తూ మార్క్స్ ఆవిష్కరించిన చరిత్రంతా వర్గ పోరాటాల చరిత్రే, పెట్టుబడికి శ్రమకు మధ్య ఉన్న సంబంధం అదనపు విలువల ఆధారంగా శాస్త్రీయ సోషలిజాన్ని వివరిస్తూ 1880లో 'సోషలిజం: ఊహాజనితం, శాస్త్రీయం'ను రచించాడు.

వానరుడు నరుడుగా మారే క్రమంలో శ్రమ నిర్వహించిన పాత్ర అనే వ్యాసాన్ని 1876లో ఎంగెల్స్ రచించాడు. ఇది మొదటి సారిగా Die Neue Zeit పత్రికలో 1895-96లో ప్రచురించ బడింది. ఇందులో శ్రమ అద్భుతమైన పాత్రను, వ్యక్తిగత, అలాగే సామూహిక మానవ శ్రమ ప్రకృతిపై వేసిన ప్రభావం దాని ఫలితంగా మానవుల్లో కలిగిన మార్పులు ఎలా పరస్పరం ఒకదానికొకటి మార్చుకుంటున్నాయో వివరించాడు. ఒక రకంగా శ్రమయే మానవున్ని సృష్టించిందని స్పష్టం చేశాడు. ఈ వ్యాసం మానవ శారీరక, మేధో వికాసానికి కారణమైన జీవ భౌతిక కారకాలను విశదీకరించి శాస్త్రీయ ఆలోచనలను కలిగించింది.

జంతువు బాహ్య ప్రకృతిని కేవలం వినియోగించు కుంటుందని, కేవలం తన ఉనికి ద్వారా దానిలో మార్పులు తెస్తుందని, కాని మనిషి తన చర్యల ద్వారా తన ప్రయోజనాలను ప్రకృతి నెరవేర్చే లాగా చేసి, దాని పైన ఆధిపత్యం చెలాయిస్తాడు. ఇలా మనిషికి, ఇతర జంతువులకు తేడాను వివరిస్తాడు. అయితే ప్రకృతిపై సాధించిన విజయాలు భవిష్యత్‌లో మానవులపై వ్యతిరేక ప్రభావాలను చూపుతుందని చెబుతాడు. ప్రకృతి నియమాలను అర్థం చేసుకుని వాటిని సరిగ్గా అమలుపరచడంలోనే మానవాభ్యుదయం ఆధారపడి ఉందని, ప్రకృతితో తమ ఏకత్వాన్ని అనుభూతి చెందడంతో పాటు దానిని గ్రహిస్తారని ఎంగెల్స్ వివరిస్తాడు.

నూలు వడికే యంత్రాలు, మారమగ్గాలు, స్టీమ్ ఇంజన్ వంటి శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలు అప్పటి సమాజాల్లో తెచ్చిన ముఖ్యమైన మౌలిక మార్పులను వివరిస్తూ అవి ఆధిపత్య శక్తులకు, పారిశ్రామిక అధిపతుల చేతుల్లో చేరి కార్మికుల శ్రమను దోచుకోవడానికి దోహదపడిన తీరును సామాజిక సంబంధాల్లో వస్తున్న మార్పులను సృజనాత్మకంగా వివరించాడు. మానవుని జీవితాన్ని పెంచి పోషించే వస్తువుల ఉత్పత్తి, తరువాత వాటి మారకం, ఇదే మొత్తం సామాజిక వ్యవస్థకంతకూ పునాది అని, చరిత్రలో ఆవరించిన ప్రతి సమాజంలోనూ సంపద ఏ విధంగా విభజింపబడుతుందో, ఏయే వర్గాలుగా లేదా తరగతులుగా సమాజం విభజించబడుతుందో, ఏవేవి ఉత్పత్తి చేయబడు తున్నాయో, అవెలా ఉత్పత్తి చేయబడుతున్నాయో, ఎలా మార్పిడి చేయబడుతున్నాయో అనేవాటి మీద సామాజిక వ్యవస్థ ఆధారపడి ఉంటుంది. ఇలా సమాజంలో జరిగే మార్పులన్నింటికీ, రాజకీయ విప్లవాలన్నిటికీ అంతిమ కారణాలు మనుషుల మెదడుల్లో కాక, శాశ్వత సత్యం, శాశ్వత ధర్మం అనే భావాలకు సంబంధించిన వారి గాఢ అవగాహనల్లో కాకుండా ఉత్పత్తి పద్దతులలోను, మారకపు పద్ధతుల్లోనూ వచ్చే మార్పుల్లో గోచరిస్తాయని ఎంగెల్స్ చెబుతాడు.

చారిత్రక పరిణామాలకంతకు మూల కారణం, ముఖ్యమైన చారిత్రక ఘటనలన్నింటికీ చోదకశక్తి సమాజపు ఆర్థిక పురోగతి అని ఉత్పత్తి పద్ధతుల్లో, మారకపు పద్ధతుల్లో వచ్చే మార్పులేనని, తత్ఫలితంగా సమాజం విభిన్న వర్గాలుగా విభజన చెందడమేనని, ఆ వర్గాల మధ్య జరిగే పోరాటాలేనని చెప్పేది చారిత్రక భౌతికవాదం అని చెబుతాడు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి తాత్త్విక ప్రాతిపదిక అయిన చారిత్రక భౌతికవాద దృక్పథాన్ని 1844లో 'జర్మన్ ఐడియాలజీ' అనే గ్రంథంలో మార్క్స్ తో కలిసి ఎంగెల్స్ వివరిస్తాడు. సామాజిక మార్పుకు చోదక శక్తులుగా కార్మిక వర్గాన్ని గుర్తించి వర్గాలుగా ఉన్న సమాజాన్ని మౌలికంగా మార్చడానికి కావల్సిన సిద్ధాంతాన్ని ప్రాతిపాదించి కార్మిక వర్గానికి అసలు సిసలు మిత్రునిగా ఎంగెల్స్ నిలిచాడు.

జీవ శాస్త్రానికి డార్విన్ పరిణామవాద సిద్ధాంతం ఎంత ముఖ్యమో, ఆర్థిక శాస్త్రానికి మార్క్స్ అదనపు విలువ సిద్ధాంతం ఎంత ముఖ్యమో నాగరిక ప్రజలలో కనిపించే తండ్రి హక్కు గణాలకు పూర్వం తల్లి హక్కు గణాలు ఉండేవని మోర్గన్ కనిపెట్టిన అంశం అంతే ముఖ్యమని, కుటుంబ వ్యవస్థ చరిత్రను మొట్టమొదటిసారిగా లూయిస్.ఎచ్. మోర్గన్ బయట పెట్టాడని ఎంగెల్స్ చెబుతాడు. 'ప్రాచీన సమాజం' అనే గ్రంథాన్ని రాసిన ఇతని గురించి చెబుతూ లిఖిత చరిత్రకు వెనుక ఉన్న ఆదిమ చరిత్రలోని ప్రధానాంశాలను కనిపెట్టి వాటిని క్రమ రూపంలో పెట్టడం ద్వారా మోర్గన్ గొప్ప సేవ చేశాడని, ప్రాచీన గ్రీకు, జర్మన్ చరిత్రలో అపరిష్కృతంగా మిగిలిపోయిన అతి ముఖ్యమైన సమస్యలకు సమాధానాన్ని ఆయన ఉత్తర అమెరికన్ ఇండియన్ ప్రజా సమూహాల్లో లైంగిక సంబంధాల ప్రాతిపదికన ఏర్పడిన జీవన పద్ధతుల్లో కనుక్కున్నాడు. అదే ఆయన గొప్పతనంలోని విశేషం అని అంటాడు ఎంగెల్స్. ఆయన ఒక్క రోజు పాటు కూర్చుని రాసేసిన పుస్తకం కాదని, దాదాపు నలభై ఏళ్ల పాటు కుస్తీపట్టి, విషయాలన్నీ కరతలామలకం చేసుకుని రాసిన పుస్తకం 'ప్రాచీన సమాజం' అనీ, అది మన రోజుల్లో వెలువడిన యుగ పరివర్తక ప్రభావం కలిగిన పుస్తకాలలో అదొకటనీ ఎంగెల్స్ అభిప్రాయ పడ్డాడు.

జీవ పరిణామ సిద్ధాంతాన్ని చార్లెస్ డార్విన్ శాస్త్రీయ ఆధారాలతో అందించినట్లుగానే ఎంగెల్స్ సమాజ పరిణామ క్రమాన్ని 'కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక' అనే గ్రంథంలో వివరించాడు. ఈ గ్రంథాన్ని లూయిస్. హెచ్. మోర్గన్ పరిశోధనలను దృష్టిలో పెట్టుకుని ఎంగెల్స్ రాశాడు. ఇది మానవ సమాజ పరిణామ క్రమాన్ని ఆధారాలతో వివరించిన మార్క్సిస్టు సైద్ధాంతిక, ప్రామాణిక గ్రంథం.

మార్క్స్, ఎంగెల్స్ ల పరస్పర మేధో వికాసానికి వారి మధ్య జరిగిన చర్చలు, ఆలోచనల ఘర్షణలు ఎంతో దోహదపడి శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతానికి పునాదులు వేశాయి. శ్రామిక వర్గానికి సిద్ధాంత ఆయుధాన్ని, ఆచరణాత్మక మార్గాన్ని నిర్దేశించాయి. మార్క్స్, ఎంగెల్స్‌ల సమ్మిళిత ఆలోచనా ధారల ప్రభావం అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘం ఏర్పడడానికి దోహదపడింది. వీరిద్దరి ఉమ్మడి అవగాహనతో ఎంగెల్స్ తయారు చేసిన దానికి చిన్న చిన్న మార్పులు మార్క్స్ చేయగా 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక'

రూపుదిద్దుకుంది. ఈ ప్రణాళిక వర్గరహిత సమాజం రూపొందడానికి తద్వారా ప్రపంచ వ్యాప్తంగా దోపిడీ పీడనలు లేని నూతన సమాజం, నూతన ఉన్నత మానవుడుగా రూపొందడానికి కావల్సిన మార్గాన్ని చూపింది.

అసమానతల సమాజాలు ఎక్కడున్నా అక్కడ ఎంగెల్స్ ఆలోచనలు ఉంటాయనడంలో సందేహపడాల్సింది లేదు. అశాస్త్రీయమైన మతాలను, వాటి పునాదులను, దోపిడీ పీడనల మూలాలను అవగాహన చేసుకోవడానికి, వాటిని ఎదుర్కోవడానికి సైద్ధాంతిక పరికరాలను అందించి శ్రామికవర్గం చేతుల్లో ఆయుధం అయ్యాడు. శ్రామికవర్గం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకుని, తద్వారా పెట్టుబడిదారుల చేతుల్లోని సామాజిక ఉత్పత్తి సాధనాలను యావత్తు సమాజపు ఆస్తిగా మార్చి వేస్తుంది. ఈ చర్య ద్వారా శ్రామికవర్గం ఉత్పత్తి సాధనాలన్నింటినీ వాటి పెట్టుబడిదారీ స్వభావం నుండి విముక్తం చేసి వాటి సామాజిక స్వభావం సంపూర్ణంగా వికసించేందుకు స్వేచ్ఛను కల్పిస్తుంది. అలా శ్రామికవర్గ విప్లవం వర్గాల అస్థిత్వాన్ని రద్దు చేస్తుందని, అటువంటి విప్లవ ఆవశ్యకతను ఎంగెల్స్ తాను 1880లో రాసిన 'శాస్త్రీయ సోషలిజం'లో వివరిస్తాడు.


ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద శక్తులు విస్తరిస్తున్న నేపథ్యంలో మన దేశంలో హిందూ ఫండమెంటలిజం ఫాసిజంగా వికృత పోకడలు పోతున్న సందర్భంలో ఎంగెల్స్ ఆలోచనలు, సిద్ధాంతాలు, ఆచరణలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. మార్క్స్‌తో కలిసి ఆయన రూపొందించిన శాస్త్రీయ సోషలిజం ఆవశ్యకత ఎంతగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఎంగెల్స్ జన్మించి 2019 నవంబర్ 28 నాటికి రెండు వందల ఏళ్లు అవుతున్న సందర్భంలో ఆయన్ను స్మరించుకోవడం, ఆయన అందించిన ఆలోచనా ధారాలను గుర్తుకు తెచ్చుకోవడం అంటే ఆయన కాంక్షించిన వర్గరహిత సమాజం కోసం జరుగుతున్న కృషిలో పాలు పంచుకోవడం కూడా.

మార్క్సిజంను రష్యాలో లెనిన్ అన్వయించి, దాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లాడు. అటు తర్వాత చైనాలో మావో మార్క్సిజానికి మరిన్ని ఆచరణా మార్గాలను, సిద్ధాంతాలను జోడించి దానికి మెరుగులు దిద్దాడు. రష్యా, చైనాల్లో విప్లవాలు విజయవంతం కావడం, ఆ తర్వాత వాటి వైఫల్యాల నేపథ్యంలో ప్రపంచంలో అనేక ప్రాంతాలలో జరుగుతున్న సోషలిస్టు ఉద్యమాలు వాటి అనుభవాలను గమనంలో పెట్టుకుని భారత దేశంలోని భౌతిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణంగా ఎంగెల్స్ మార్క్స్ తో కలిసి అందించిన సిద్ధాంతాల వెలుగులో మార్క్సిజాన్ని మరింత ముందుకు తీసుకుపోతూ, సృజనాత్మకంగా అన్వయించవల్సిన చారిత్రక అవసరం నేడు ఉన్నది. ❑

*'వీక్షణం' మాసపత్రిక సౌజన్యంతో...*

# ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి ప్రత్యేక సంచిక

## వ్యాసాలకు విజ్ఞప్తి



ఇది ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి సంవత్సరం. మార్క్సిజం, మార్క్స్ రచనలు, మార్క్స్–ఎంగెల్స్‌ల సంయుక్త రచనలు, ఎంగెల్స్ రచనల సమాహారం. ప్రపంచాన్ని దోపిడీ నుండి విముక్తి చేసే ఒక కొత్త తాత్విక, ఆర్థిక, చారిత్రక దృక్పథాన్ని అది వివరిస్తుంది.

జాతీయ స్ఫూర్తి 2020 ఫిబ్రవరి సంచికను **"ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి ప్రత్యేక సంచిక"** గా రూపొందిస్తున్నది. ఎంగెల్స్ జీవితము, సాగించిన సిద్ధాంత కృషి ప్రతిబింబించేలా ఈ సంచికకు వ్యాసాలను పంపించవలసినదిగా కోరుతున్నాం.

ఎంగెల్స్ రచనల మీద, మార్క్స్ – ఎంగెల్స్‌ల సంయుక్త రచనల మీద విశ్లేషణలు, పుస్తక పరిచయ వ్యాసాలను టైపులో నాలుగు, అయిదు పేజీలకు మించకుండా ఏదో ఒక అంశం మీద 2020 జనవరి 30 లోగా అందేలా పంపండి.

**email : dvvsvarma1946@gmail.com**

# మార్క్సిజం, నేటి ఔచిత్యం

## మైఖేల్ ఎ. లెబోవిజ్ తో ఇంటర్వ్యూ

సరళ అనువాదం : **రావు కృష్ణారావు**

ప్ర :మార్క్సిజానికి నేటికీ ఔచిత్యముందనుకుంటున్నారా? ఉందనుకుంటే ఏయే భాగాలకుంది?

జ : ప్రస్తుత పెట్టుబడీదారీ వ్యవస్థను అర్థం చేసుకోడానికి మార్క్సిజం చాలా సందర్భోచితమైనదని నేను భావిస్తున్నా! పెట్టుబడిదారీ విధానం మారిపోయింది గాబట్టీ మార్క్సిజాన్ని మార్చాలనుకోవడం తప్పు. మార్క్సు కేపిటలిజం స్వభావాన్ని గ్రహించాడు. కేపిటలిజం దానికున్న కొన్ని రూపాలను మార్చుకున్నప్పటికీ దాని సారాంశం (essence) అలాగే మిగిలి వుంది. ఉత్పత్తి సాధనాల యజమానుల లాభాల కోసం వేతన కార్మికులను దోచుకోవడం, వారిని విరూపం (deform) చేయడం అనేదానిపై ఆధారపడిన వ్యవస్థ కేపిటలిజం. ఇదేమీ మారలేదు.

ప్ర :ప్రస్తుతం మార్క్సిజం పరిష్కరించాల్సిన ప్రధాన సైద్ధాంతిక సమస్యలు ఏమిటి ?

జ : ఉత్పత్తి ప్రక్రియలో మానవులెలా ఉత్పత్తి అవుతారనే దానిమీద ఇప్పుడు స్పష్టత లేదు. ఉత్పత్తి సంబంధాల గురించి మన వక్కాణింపు లోపించడం దీనికి ప్రధాన కారణం. ప్రజలమీద పెట్టుబడిదారీ ఉత్పత్తి ప్రభావాన్ని విస్మరించి కేవలం దోపిడీ గురించి మాట్లాడే ధోరణి ప్రబలింది. కానీ మార్క్సు చేసింది అది కాదు. పెట్టుబడి పోగుబడడానికి కారణం దోపిడీ అని మార్క్సు వివరించాడు. కానీ కేపిటలిజం ప్రజలను ఎలా ధ్వంసం చేస్తుందో గుర్తించాడు. దాన్నుండే ఆయన ఆగ్రహం, ఆవేశం జనించాయి. మీరిది మరిచిపోతే ఉత్పత్తి శక్తుల అభివృద్దే ప్రధానమని, అదెలా జరుగుతుందనేది కాదనే నిర్ధారణకు రావడం చాలా సులభం. ఆ విధంగా మీరు ఈ పరిస్థితుల్లో తయారైన ప్రజల స్వభావం గురించి ఆలోచించకుండా నిర్బంధ శ్రమని (gulags), కేపిటలిజాన్ని సమర్థించవచ్చు. మార్క్సును మళ్ళీ చదవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్ర :మీ గ్రంథం 'The socialist alternative: Real Human Development' ఇతివృత్తం ఏమిటి? నిజమైన మానవాభివృద్ధి ప్రధాన లక్షణాలు ఏవనుకుంటున్నారు?

జ : నేను నా గ్రంథంలో మార్క్సు వక్కాణించిన 'మానవాభివృద్ధే అన్నిటికీ కీలకం' అనే విషయానికి తిరిగి మళ్ళడానికి ప్రయత్నించాను. మనుషులు 'సంపద్వంతమైన మానవులుగా (rich human beings) అభివృద్ధి చెందడానికి అనుమతించే సమాజాన్ని సృష్టించడమే మార్క్సు లక్ష్యం. ఆయన సంపద్వంతమైన మనుషుల గురించి మాట్లాడుతున్నాడంటే అపరిమిత వినిమయ శక్తి గలవారి గురించి కాదు.వారి వారి అంతర్గత శక్తులను, సమర్థతలను పెంచుకో గలవారి గురించి మాట్లాడుతున్నాడు. అంటే అది బహుముఖ సామర్థ్యాలు, వ్యక్తిత్వం కలిగిన ఒక సంపన్న వ్యక్తిత్వం. దీనికి 'ఆలోచన, ఆచరణల సమ్మేళనం' అవసరమని మార్క్సు చాలా స్పష్టంగా చెప్పాడు. దీనర్థం మానసిక, శారీరక కార్యకలాపాల మధ్య విభజన అంతమవ్వాలి. అంటే ప్రజలు ఇతరుల ప్రయోజనాల కోసం ఇతరుల అదుపాజ్ఞలలో పనిచేయడం అంతమవ్వాలి. ఈ రకమైన మానవాభివృద్ధి అనేది పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలలో పూర్తిగా అసాధ్యం.

ప్ర :మానవాభివృద్ధిని ప్రోత్సహించడానికి కేపిటలిజం కాక కేవలం సోషలిజం మాత్రమే ఏకైక మార్గమని మీరు ఎందుకు భావిస్తున్నారు?

జ : మానవాభివృద్ధికి ఉత్పత్తి సాధనాలపై ఉమ్మడి యాజమాన్యం ప్రాతిపదికగా నడిచే సహకార సమాజం అవసరమని మార్క్సు నమ్మాడు. నేను ఆయనతో పూర్తిగా ఏకీభవిస్తాను. మనం దాని గురించి మరింత నిర్దిష్టంగా చెప్పుకోవాలి. నేను నా పుస్తకంలో అదే చేశాను. నిజమైన మానవాభివృద్ధికి ప్రజలు వారి సొంత కార్యకలాపాల ద్వారా అభివృద్ధి చెందే ఉత్పత్తి సంబంధాలు అంటే కార్మికులచే నిర్వహించబడే సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు అవసరం. కానీ దీనికి ఉత్పత్తి సంబంధాల ఉమ్మడి యాజమాన్యం అంటే సామాజిక యాజమాన్యం ఆవశ్యకం. సామాజిక యాజమాన్యం అంటే రాజ్య (state) యాజమాన్యం లేదా వైయుక్తిక కార్మిక బృందాల యాజమాన్యం కాదు. సమాజ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిలో ప్రత్యక్షంగా, చైతన్యయుతంగా నిమగ్నమయ్యే సమాజం యొక్క యాజమాన్యం. అందుచేత ఒక సామాజిక సంస్థగా కమ్యూనిటీ క్రియాశీలంగా ఉండాలి. ఈ సంస్థ తీర్చవలసిన అవసరాలను గుర్తించాలి. మనం ఆ కమ్యూనిటీలో ఉన్నంత వరకూ సౌభ్రాతృత్వంతో

ఇతరుల కోసం ఉత్పత్తి చేస్తాం. అందుచేత మనకిక్కడ ఒక సోషలిష్టు త్రిభుజం ఉంది. (1) ఉత్పత్తి సంబంధాల సామాజిక యాజమాన్యం (2) కార్మికులు నిర్వహించే సమాజిక ఉత్పత్తి (3) సామాజిక అవసరాలను తీర్చడం కోసం ఆ ఉత్పత్తి నుద్దేశించడం. ఈ సమాజం కోసం మార్క్సిష్టులూ, సోషలిష్టులు అందరూ పోరాడాల్సి ఉంది. ఇది రాత్రికి రాత్రే జరగదు. మనం త్రిభుజంలోని మూడు రంగాల్లోనూ ఏకకాలంలో పోరాడాల్సిఉంది. కొన్ని రంగాలను భవిష్యత్తుకి వదిలేయకూడదు. ఎందుకంటే కేపిటలిజానికి అన్ని వైపులా ఉన్న అన్ని రకాల వికృతాలనూ అంతమొందించడానికి మనం పోరాటం చేయకుంటే ఆ భవిష్యత్తు ఎప్పటికీ రాదు. మనం ఆ త్రిభుజంలో కొన్నింటిని వదిలేసినప్పుడు మనం ఆయా స్థానాల్లో పెట్టుబడి తర్కం వర్ధిల్లేందుకు అనుమతిస్తున్నామన్న మాట.

ప్ర :మీ అభిప్రాయంలో గత దశాబ్దాలలో అత్యంత ముఖ్యులైన మార్క్సిస్టు మేధావులెవరు? మార్క్సిజం అభివృద్ధికి వారి దోహదాల ప్రాధాన్యత ఏమిటి?

జ : అత్యంత ముఖ్యులైన మార్క్సిస్టు మేధావుల గురించి చెప్పాలంటే మార్క్సిస్టు ఆర్థికవేత్తలకు బయట వెదకాలి. అత్యంత ప్రధానమైన మార్క్సిస్టు తత్వవేత్త ఇస్తవాన్ మెజరోస్. ఆయన ఎందుకు ప్రధానమైనవాడంటే మార్క్సులోని 'సజీవ ఆంగిక వ్యవస్థ (organic system) చాలా కీలకమైనదని నొక్కి చెప్పాడు. అలాగే కాపిటలిజం ఒక సజీవ ఆంగిక వ్యవస్థ అని మరిచిపోతే వచ్చే ప్రమాదాల గురించి నొక్కి చెప్పాడు. మార్క్సిస్టు జీవ శాస్త్రవేత్త రిచర్డ్ లెవిన్స్ మరో అత్యంత ప్రముఖుడైన మార్క్సిస్టు. ఈయన మరొకరితో కలిసి 'The Dialectical Biologist' అనే పుస్తకాన్ని రచించాడు. పశ్చిమ దేశాల చింతనపై ఆధిపత్యం గల అణువాద, కార్టీజియన్ వాద దృక్పధాలకు విరుద్ధంగా గతితార్కిక ప్రాపంచిక దృక్పథాన్ని అత్యంత ప్రతిభావంతంగా విశ్లేషించాడు. వీరితో బాటు మార్క్సిజానికి పర్యావరణానికి ఉన్న సంబంధాన్ని గుర్తించి, తన గ్రంథం 'Marx and Ecology' లో వివరించిన జాన్ బెల్లామి ఫాస్టర్ ముఖ్యుడు. వీరందరి ప్రభావం నామీద చాలా ఎక్కువగావుంది. చివరగా మార్తా హర్నెస్కర్ గురించి చెప్పాలి. రాజకీయ పార్టీలు, సామాజిక ఉద్యమాలపై –ముఖ్యంగా లాటిన్ అమెరికాలో– ఈమె కృషి చాలా ప్రధానమైనది.

ప్ర :ఇటీవలి సంవత్సరాల్లో మార్క్సిజం గురించిన చర్చలు, వాదోపవాదాలు మొదలవ్వడమే కాకుండా కొత్త బలం పుంజుకున్నాయి. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించడంలో మార్క్సిజం మరింత ఎక్కువ పాత్రను నిర్వహించగలదని మరింత ఎక్కువ మంది ప్రజలు భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిలో మార్క్సిజం యొక్క ప్రాధాన్యత గురించి మీరేమనుకుంటున్నారు?

జ : నేటి పెట్టుబడిదారీ సంక్షోభం గురించి తెలుసుకోవడం మార్క్సిజం వల్ల మాత్రమే సాధ్యమనేదాంట్లో సందేహం లేదు. మార్క్సిస్టేతరులకు ప్రతీదీ యాదృచ్ఛికం లేదా తప్పుడు నిర్ణయాల యొక్క ఫలితం. వారు కారణాలను, వాటి ఫలితాలను వేరుచేసి చూడలేరు. తరచూ లక్షణాలను (symptoms) సమస్యకు మూలాలుగా భావిస్తారు. అందుకు విరుద్ధంగా మార్క్సిజం మనకు కేపిటలిజాన్ని ఒక మొత్తంగా (whole) చూడడానికి, సంక్షోభాలకు దిగువన గల కారణాలనే కాకుండా అది (కేపిటలిజం) నిరంతరాయంగా విస్తరించే దశలను తెలుసుకోవడానికి సావకాశం కల్పిస్తుంది. అయితే మార్క్సిజం సంక్షోభాలను పరిష్కరించగలదని భావించడం తప్పు. మార్క్సిజం ఒక సిద్ధాంతం, అర్థం చేసుకునే మార్గం. అంతిమంగా కేపిటలిస్టు సంక్షోభాలను అంతమొందించే ఏకైక మార్గం కేపిటలిజాన్ని అంతం చేయడమే! దానికి సిద్ధాంతంతో పాటు అదనంగా ఈ వికృత ఆర్థిక వ్యవస్థను అంతం చేయాలనే నిబద్ధత, నిశ్చయం కావాలి.

ప్ర :మార్క్సిస్టు ఉద్యమానికీ శ్రామికోద్యమానికీ సంబంధం ఉందని మీరు భావిస్తున్నారా? మొత్తంమీద మార్క్సిజాన్ని ప్రత్యేకంగా మావోయిజాన్ని సైద్ధాంతిక ఆయుధంగా కలిగిన ఉద్యమాలు ఉన్నాయా? ఈ రోజుల్లో వామ పక్ష ఉద్యమాల ప్రధాన సమస్యలు ఏమిటి?

జ : దురదృష్టవశాత్తూ ప్రస్తుత కాలంలో వామపక్ష ఉద్యమాలు, శ్రామికోద్యమాలపై మార్క్సిజం ప్రభావం ఏమీ లేదు. అలాగే అరబ్బు వెల్లువ (Arab Spring), ఆక్యుపై ఉద్యమాలతో ముడిపడిన పరిణామాలలో కూడా మార్క్సిజం ప్రాధాన్యత ఏమీ లేదు. నా ఉద్దేశంలో ఇది కొంతవరకూ 20వశతాబ్దంలో మార్క్సిజం ఏ మేరకు వికృతమయ్యిందో తెలియజేస్తుంది. సామాజికోద్యమాలలో ప్రతిఫలించిన ప్రజల అవసరాలను, ప్రజలు తమ జీవితాలకు అత్యంత ప్రధానమైనవిగా భావించే వాటిని అది పట్టించుకోవడం లేదు. మార్క్సిజం యొక్క కేంద్రం నుండి మానవులు మాయమైపోయినప్పుడు మార్క్సిజం ప్రజల అవసరాలను పట్టించుకోక పోవడంలో ఆశ్చర్యం ఏముంది! అందుచేత ఇది ఒక సమస్య.

ఇంకో సమస్య ఏమిటంటే మార్క్సిస్టు ఆర్గనైజర్లు అన్ని సమస్యలకు సమాధానాలు తమ వెనుక జేబులో ఉన్నాయని, కాబట్టి సామాజికోద్యమాలన్నీ తాము చెప్పేదే వినాలని నమ్ముతారు. "'సత్యం ఇక్కడుంది. ఇక్కడ మోకరిల్లు' అని మనం చెప్పం" అని మార్క్సు చెప్పడంలో సరిగ్గా ఈ దృక్పథాన్నే తిరస్కరించాడు. ఒక్క మాటలో చెప్పాలంటే మార్క్సిస్టు ఆర్గనైజేషన్లు ఎలా వినాలో మరిచిపోయాయి.

ప్రజలు బాధలు పడుతున్నారనేది నిశ్చయం. వారు కోపంగా ఉన్నారనేది కూడా అంతే నిశ్చయం. నయా ఉదారవాదం, కాపిటలిస్టు సంక్షోభం, ఆహారోత్పత్తి సంక్షోభాల వల్ల ఆ కోపం పెరుగుతున్నది. తాము అన్యాయం అనుకున్నదానిపట్ల ప్రజలు స్పందిస్తున్నారు. కానీ వారు ప్రస్తుతం మార్క్సిజం వైపు చూడడం లేదు. బహుశా చాలా చోట్ల అరాచకవాదులను (anarchists) జనం ఎక్కువ ఆదరిస్తున్నారు. సమంజసమైన వామపక్ష విశ్లేషణ లేనప్పుడు, దాన్ని ప్రజలకు అందించ లేనప్పుడు ఫాసిజం ఆ ఖాళీని ఆక్రమించే ప్రమాదముందని మనం గుర్తించాలి. మనమీద చాలా పెద్ద బాధ్యత ఉంది. అదేమిటంటే అన్యాయంపట్ల ప్రజల్లో ఉన్న ఆగ్రహావేశాలను పునాదిగా చేసుకుని ఆ అన్యాయాల మూలం వివరించాలి. న్యాయమైన వేతనాలు, న్యాయమైన పనిదినం గురించిన 19వ శతాబ్దపు మితవాద నినాదాలను అధిగమించి వేతన సంబంధాన్ని అంతంచేయాలనే విప్లవ నినాదం ఇవ్వాలని మార్క్సు ఏవిధంగా పట్టుబట్టాడో ఆ విధంగా చేయాలి. కానీ అలా చేయడానికి ముందు మనం వినడం, అర్థంచేసుకోవడం ప్రారంభించాలి. మనం అలా చేయకపోతే ఫాసిజం, మత మౌఢ్యం విజయం సాధిస్తాయి.

ప్ర : చైనా అభివృద్ధి గురించి మీరేమనుకుంటున్నారు? మార్టిన్ జాక్విస్ తన పుస్తకంలో చెప్పినట్లుగా చైనా నిజంగా ప్రపంచాన్ని పాలిస్తుందా?

జ : ప్రపంచంలో చాలా గొప్ప పెట్టుబడి పునర్వ్యవస్థీకరణ జరుగుతున్నది. అమెరికా స్థానంలో చైనా 21వ శతాబ్దపు ఆధిపత్య పెట్టుబడీదారీ వ్యవస్థగా, షాంఘై ఆధిపత్య నగరంగా ఆవిర్భవిస్తున్నాయనడంలో నాకు వీసమెత్తు సందేహం కూడా లేదు. దీనికి చాలా కారణాలున్నాయి. వాటిలో ఒకటి గ్రామీణ ప్రాంతాల నుండీ చాలా ఎక్కువమందిని తెచ్చి ఎగుమతుల ధోరణితో ఉత్పత్తి చేయగల సామర్థ్యం. మరో కారణం కీలక రంగాలను విస్తరించడానికి, పోషించడానికి 'రాజ్యా'న్ని ఉపయోగించే సామర్థ్యం ఉండటం. అయితే చైనా సోషలిజం వైపు పయనిస్తున్నదని నేను నమ్మడంలేదు. ❑

***ఈ ఇంటర్వ్యూ సెప్టెంబర్ 2012లో జరిగింది.***
***మార్చి 2013 మంత్లీ రివ్యూలో ప్రచురితం.***
***(కమ్యూనిజం నవంబర్ 2016)***

---

## మతం పేరిట దౌర్జన్యాలు ఆధిపత్యం కోసమే

**(19వ పేజీ తరువాయి)**

రొహింగ్యా అనే ముస్లిం వలస జాతిని సమూలంగా నాశనం చేయాలని ఇప్పుడు మయన్మార్‌గా పిలవబడుతున్న బర్మాలో ఇటీవల తీవ్ర ప్రయత్నాలు జరిగాయి కదా? మానవ హక్కులు కాలరాయబడ్డాయి కదా? దాని వెనక రాజకీయ, ఆర్థిక, నైతిక, దౌత్య కారణాలెన్నో ఉన్నాయి. కేవలం మతమొక్కటే కాదు. లేకపోతే శాంతి కాముకులు అని అనుకుంటున్న బౌద్ధ భిక్షువులు చెలరేగడమేమిటి? మన దేశంలోనూ ఎన్ని అఘాయిత్యాలు జరగలేదూ? హైదరాబాదులోని మక్కా మసీదులో హిందువులు ముస్లింలను చంపారు. మాలెగావ్‌లో బాంబులు పేల్చి హిందువులు ముస్లింలను చంపారు. అజ్మీరు దర్గాలో బాంబులు పేల్చి ముస్లింలను చంపారు. ఢిల్లీ నుండి లాహోర్ వెళ్ళే రైల్లో బాంబులు పెట్టిన కాషాయ ఉగ్రవాదులు ముస్లింలను చంపారు. లక్షల మంది బౌద్ధులను ఈ హిందూ ఉగ్రవాదులే నరికేశారు. దేశంలో గుజరాత్ గాయాన్ని ఎవరు మరచిపోగలరూ? కాషాయ వర్ణం కసాయితనానికి చిహ్నామవుతోందా ?

దక్షిణాదిన ఉన్న ఒక ముస్లిం రాజకీయ పార్టీ, ఉత్తరాది ఎలక్షన్లో తమ అభ్యర్థుల్ని నిలబెడుతుంది. ఎందుకూ అంటే, అక్కడ ఉన్న తమ తమ విశ్వాసకుల సహాయంతో గెలిచి రాజకీయంగా బలపడేందుకు. అంతేకాని మతాన్ని బలోపేతం చేయడానికి కాదు. వానపామును గాలానికి గుచ్చి చేపలు పట్టినట్టు – మతాన్ని చూపించి అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే ఎవరు చేసినా. ఇది అన్ని మతాలకూ వర్తిస్తుంది. మతపెద్దలందరూ ఒకేలా ప్రవర్తిస్తారు. బూర్జువా రాజకీయ నాయకులంతా ఒకేలా ఆలోచిస్తారు. ఈ లింకు తెగాలి. మతానికీ రాజకీయానికీ లంకె తెగిపోతే గాని సామాన్యుడికి ఊపిరి ఆడదు. దేశంలో స్వేచ్ఛాలోచనలు సాగవు. మానవత్వాన్ని మంట గలిపే ప్రయత్నంలో ఏ ఏ మతమూ వెనుకంజ వేయలేదని గత చరిత్ర చెబుతోంది. నడుస్తున్న చరిత్ర చూపెడుతోంది. ❑

RNI Regn No. 52879/93


# రత్న నర్సింగ్ హోమ్

# Ratna Nursing Home

రైల్వే ఓవర్‌బ్రిడ్జి వద్ద, సజ్జాపురం

**తణుకు**

*Consulting Doctors*

**డా॥ వల్లూరి సోమశేఖర్**

M.B.B.S., D.C.H, M.D. (Gen Medicine)

Regd. No. 16999

**డా॥ బిక్కిన ఘనశ్యామ్**

M.B.B.S., M.D. (Gen Medicine)

Regd. No. 78473

**డా॥ వల్లూరి సుబ్బలక్ష్మి**

M.B.B.S., D.G.O.

Regd. No. 18121

**డా॥ బిక్కిన అమృత రత్న**

M.B.B.S., M.S., (OBG/Gynea)

Regd. No. 85666


**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : D V V S Varma**